## ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టిన కారు.. ఒకరు మృతి..

పెద్దపల్లి : పెద్దపలి జిల్లాలో పండుగపూట విషాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న డీసీఎంను కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే..జిల్లాలోని గోదావరిఖని ఇందిరా గాంధీ చౌరస్తా వంక బెండు వద్ద ఆగి ఉన్న వ్యానును ఢీ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :278 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 14-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలి.. సీఎం రేవంత్



హైదరాబాద్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భోగి పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపుతూ, కొత్త కాంతులు పంచే భోగి మంటలు ప్రతి ఇంటా భోగభాగ్యాలు వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రజా పాలన తెచ్చిన మంచి మార్పులతో అన్ని వర్గాలకు అంతా మంచి జరగాలన్నారు.రైతు భరోసాను రూ.12 వేలకు పెంచటంతో పాటు వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండుగ నాంది పలుకుతోందని అన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికీ చేరాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగమనం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని అన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## భారత్-బంగ్లాదేశ సరిహద్దులో ఉద్రిక్తత...

న్యూఢిల్లీ,సరిహద్దు ఉద్రిక్తతల మధ్య, బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిమ్ ఉద్దీన్ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను కలిశారు.ఈ సమయంలో సరిహద్దులో ఉద్రిక్తత గురించి ఇద్దరూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరి మధ్య సమావేశం దాదాపు 45 నిమిషాల పాటు కొనసాగింది. నిజానికి, షేక్ హసీనా ప్రభుత్వాన్ని బంగ్లాదేశ్ నుండి తొలగించిన తర్వాత, రెండు దేశాల మధ్య ఉద్రిక్తత కనిపించింది. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలు హింసకు గురవుతున్నారు. వారిని క్రూరంగా హింసిస్తున్నారు. భారతదేశం దాని గురించి కఠినంగా ఉంది. ఇప్పుడు బంగ్లాదేశ్ సరిహద్దు నుండి కూడా చొరబాట్లు ప్రారంభమయ్యాయి. ఇటీవల బీఎస్ఎఫ్ చాలా మంది స్మగ్లర్లను పట్టుకుంది. సరిహద్దు వద్ద భద్రతా ఉల్లంఘనలను నివారించడానికి, బీఎస్ఎఫ్ సరిహద్దులో ముళ్ల తీగలను ఉపయోగిస్తోంది. బిఎస్ఎఫ్ చాలా కాలంగా ఈ పని చేస్తోంది. దీనిపై బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. భారతదేశం ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని మరియు భారతదేశం-బంగ్లాదేశ్ సరిహద్దులో ఐదు చోట్ల ముళ్ల తీగలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందని బంగ్లాదేశ్ తెలిపింది. సరిహద్దులో భారతదేశం కంచె వేయడం అనధికారికం. ఇలాంటి కార్యకలాపాలు ద్వైపాక్షిక సంబంధాలకు హాని కలిగిస్తాయని బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిం ఉద్దీన్ అన్నారు.ఈ సమావేశానికి ముందు బంగ్లాదేశ్ భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను పిలిపించినట్లు వార్తలు వచ్చాయి. కానీ తరువాత సరిహద్దులో కొనసాగుతున్న ఉద్రిక్తత గురించి చర్చించడానికి అతన్ని పిలిచారని వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శిని కలిసిన తర్వాత, భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మ మీడియాతో మాట్లాడుతూ.. నేను విదేశాంగ కార్యదర్శిని కలిశాను. సరిహద్దు నేరాలను రహితంగా చేయడం, నేరస్థుల కదలికలను ఆపడం, మానవ అక్రమ రవాణా సవాళ్లను ఎదుర్కోవడం వంటి అంశాలపై చర్చించాను.సరిహ ద్దులో ముళ్ల తీగల ఏర్పాటుకు సంబంధించి మా మధ్య పరస్పర ఒప్పందం ఉందని



ఆయన అన్నారు. ఈ విషయంలో బీఎస్ఎఫ్, BG B (బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్) మధ్య చర్చలు జరుగుతున్నాయి. పరస్పర ఒప్పందం అమలు అవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇంతలో బంగ్లాదేశ్ విదేశాంగ కార్యదర్శి జాషిమ్ ఉద్దీన్ మాట్లాడుతూ.. భారత అధికారులు ఎటువం టి రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండండి. ఎందుకంటే ఇది ఉమ్మడి సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలను పెంచుతుంది. సరిహద్దులో శాంతి, సామరస్యాన్ని కాపాడుకునే విధంగా సరిహద్దు సమస్యను పరిష్కరించాలి. అంతకుముందు, బంగ్లాదేశ్ హెూం వ్యవహారాల సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) జహంగీర్ ఆలం చౌదరి మాట్లాడుతూ.. సరిహద్దు గార్డు బంగ్లాదేశ్, స్థానిక ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత కారణంగా భారతదేశం సరిహద్దులో ముళ్ల తీగలను ఏర్పాటు చేసే పనిని నిలిపివేసిందని అన్నారు. బంగ్లాదేశ్‌తో ఉన్న 4156 కిలోమీటర్ల సరిహద్దులో భారతదేశం ఇప్పటికే 3271 కిలోమీటర్ల మేర కంచె వేసిందని, దాదాపు 885 కిలోమీటర్ల సరిహద్దుకు కంచె వేయలేదని ఆయన అన్నారు. ఇటీవల ఐదు రంగాలలో వివాదాలు తలెత్తాయి.

## సంక్రాంతి తరువాత ఏ క్షణంలోనైనా రేవంత్ కేబినెట్ విస్తరణ!



హైదరాబాద్,దాదాపు ఏడాది కాలంగా రేవంత్ తన కేబినెట్ ను ఎప్పుడు విస్తరిస్తారా అన్న దానిపై తెలంగాణ వ్యాప్తంగా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఇదిగో అదిగో అంటూ పలు ముహూర్తాలు కూడా తెరమీదకు వచ్చాయి. కేబినెట్ విస్తరణే లక్ష్యంగా రేవంత్ పలుమార్లు హస్తిన వెళ్లి పార్టీ హైకమాండ్ తో భేటీ అయ్యారు కూడా. ఇంత జరిగినా తన కేబినెట్ విస్తరణ విషయంలో రేవంత్ అడుగు ముందుకు వేయలేకపోయారు.అయితే ఇప్పుడు తాజాగా రేవంత్ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దాదాపుగా ఖరారైనట్లు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చెబుతున్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి తరువాత ఏ క్షణంలోనైనా తెలంగాణ కేబినెట్ విస్తరణ ఉంటుందని వెల్లడించారు. అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందని చెప్పారు. కేబినెట్ విస్తరణతో పాటు ఇదే నెలలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ పదవుల భర్తీ కూడా ఉంటుందని చెప్పారు. గతంలోనూ చాలా సార్లు కేబినెట్ విస్తరణపై వార్తలు వచ్చినప్పటికీ విస్తరణ మాత్రం ముహూర్తం జరగలేదు. కేబినెట్ విస్తరణపై చర్చించేందుకు పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన వెళ్లి వచ్చారు. అయినా హైకమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దాంతో ఇంత కాలంగా కేబినెట్ విస్తరణ వాయిదాల మీద వాయిదాలు పడుతూ వచ్చింది. నామినేటెడ్ పదవుల విషయంలోనూ అదే పరిస్థితి. ఈ లోగా ఏడాది కాలం గడిచిపోవడం.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలు , హైడ్రా కూల్చివేతలు వంటి విషయాలలో రేవంత్ సర్కార్ తడబాటు ఆయన ప్రభుత్వ ప్రతిష్ఠను ఒకింత మసకబార్చింది. ఇక పుష్ప2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన తరువాత.. రేవంత్ అసెంబ్లీ వేదికగా కొత్త సినిమాల బెనిఫిట్ షోలకు, టికెట్ల ధర పెంపునకు తెలంగాణలో అనుమతించేదే లేదని ప్రకటన చేశారు.అయితే ఆ మాటకు ఆయన కట్టుబడలేదు. దీంతో రేవంత్ సర్కార్ కు కోర్టు అక్షింతలు వేసింది. జనబాహుల్యంలో కూడా రేవంత్ మాట మీద నిలబడలేదన్న అభిప్రాయం వ్యక్తం అయ్యింది. ఈ నేపథ్యంలోనే మరోసారి కేబినెట్ విస్తరణ అంశం తెరమీదకు వచ్చింది. రేవంత్ సర్కార్ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే కేబినెట్ విస్తరణ అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చారని పరిశీలకులు అంటున్నారు. సంక్రాంతి తరువాత కేబినెట్ విస్తరణ, ఈ నెలలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ అనగానే.. పదవులు ఎవరెవరిని వరించబోతున్నాయి, ఎవరెవరికి నిరాశ మిగులుతుందన్న చర్చ మొదలౌతుంది. ఈ ఉద్దేశంతోనే సరిగ్గగా సంక్రాంతి పండుగకు ముందు కేబినెట్ విస్తరణపై ఫీలర్ వదిలారని అంటున్నారు. కేబినెట్ విస్తరణ తరువాత పార్టీలో ఒకింత అసంతృప్తి, అసమ్మతి రేగే అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పార్టీ హైకమాండ్ ఇంత వరకూ మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా అందరితో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెడుతున్న రేవంత్ కు అసమ్మతి బెడద ఉండకూడదన్న ఉద్దేశంతోనే హైకమాండ్ విస్తరణను పెండింగ్ లో పెట్టిందని పరిశీలకులు విశ్లేషించారు. అదే కారణంతో నామినేటెడ్ పోస్టుల భర్తీని కూడా వాయిదా వేస్తూ వచ్చిందంటున్నారు. అయితే ఇప్పుడు రేవంత్ సర్కార్ అధికారపగ్గాలు చేపట్టి ఏడాది గడిచిపోవడం, మంత్రిపదవులు, నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్న వారిలో అసంతృప్తి పీక్స్ చేరుతున్న సంకేతాలు కనిపించడంతో ఏదైతే కానీ ముందు కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేయాలన్న నిర్ణయానికి హైకమాండ్ వచ్చినట్లు చెబుతున్నారు.

## మర్రి చెన్నారెడ్డి జయంతి వేడుకలు... ఘనంగా నివాళులు

వికారాబాద్: మాజీ ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లాకు చెందిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి 16వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎన్న పెల్లి చె న్నారెడ్డి విగ్రహ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల విశ్వ నివాళులర్పించారు. వికారాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కం అనంత్ రెడ్డి నేతృతంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐపి కళాశాల ప్రిన్సిపల్ లక్షమందరిక మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వీరయ్య నాయకులు కమల్ రెడ్డి యువజన కాంగ్రెస్ నాయకులు జగ్గరి వెంకటరెడ్డి, మాజీ బ్లాకర్ దశలో శ్రీనివాస ముదిరాజ్, బాపనల్ల శ్రీనివాస్ రెడ్డి, మైపాల్ రెడ్డి కమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభమేళాకు భారతీయ రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు..



లక్నో: ప్రపంచంలోనే ఆధ్యాత్మిక కార్యక్రమైన మహా కుంభమేళా సోమవారం ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమైంది. పుష్య పౌర్ణమి స్నానంతో మొదలైంది. ఈ సారి మహా కుంభమేళా భిన్నంగా ఉండనున్నది. ఎందుకంటే 144 సంవత్సరాల తర్వాత మహా కుంభమేళా జరుగుతుంది. సాధారణంగా ప్రతి ఆరుసంవత్సరాలకోసారి అర్ధ కుంభమేళా, 12 సంవత్సరాల కోసారి కుంభమేళా జరుగుతుంది. కానీ, ఈ సారి 144 సంవత్సరాల తర్వాత మహా కుంభమేళా నిర్వహించడం అనవాయితీగా వస్తున్నది.ఈ మహా కుంభమేళా ఎంతో ప్రత్యేకమని ఆధ్యాత్మికవేత్తలు పేర్కొంటున్నారు. కుంభమేళా ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లో జరుగుతుందని.. కానీ, మహా కుంభమేళా మాత్రం కేవలం ప్రయాగ్‌రాజ్‌లోనే జరుగుతుంది. దాదాపు 45 రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమానికి దాదాపు 40 కోట్ల మంది హాజరవుతారని అంచనా. యావత్ భారతదేశంతో పాటు వివిధ దేశాల నుంచి భక్తులు, పర్యాటకులు ఈ ఉత్సవానికి హాజరవుతారు. దేశంలోని నలుమూలల నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చేరుకునేందుకు భారతీయ రైల్వే ఏర్పాట్లు చేస్తున్నది.కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు, పర్యాటకుల కోసం ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నది. మహా కుంభ్‌కు వచ్చే ప్రయాణికుల సౌలభ్యం కోసం రైల్వే ప్రత్యేక సన్నాహాలు చేసింది. ఇందులో 24 గంటల వార్ రూమ్ ఒకటి. సమీపంలోని అన్ని స్టేషన్లలో సీసీకెమెరాలు, బహుభాషా కమ్యూనికేషన్ వ్యవస్థ, అదనపు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేసింది. రైల్వే బోర్డు స్థాయిలో ప్రత్యేక 'వార్ రూమ్'ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు బోర్డు ప్రచార కార్యనిర్వాహక డైరెక్టర్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. 24 గంటలు పని చేస్తుందని.. అందులో ఆపరేషన్స్, బిజినెస్, ఆర్‌పీఎఫ్, ఇంజినీరింగ్, విద్యుత్ విభాగాల అధికారులు కార్యకలాపాలను పర్యవేక్షించడంతో పాటు సమన్వయం చేస్తారని చెప్పారు.ప్రయాగ్‌రాజ్ ప్రాంతంలోని తొమ్మిది స్టేషన్లలో రియల్ టైమ్ పర్యవేక్షణ కోసం 1,176 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికుల కోసం 12 భాషల్లో ప్రకటన వ్యవస్థను ప్రారంభించారు. కుంభమేళా సమయంలో పదివేల సాధారణ రైళ్లు, 3,134 ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. ఇది గత కుంభమేళా కంటే 4.5 రెట్లు ఎక్కువ. స్వల్ప దూరానికి 1,896 రైళ్లు, 706 దూర ప్రాంతాలకు, మరో 559 రింగ్ ట్రైన్స్ నడిపించనున్నట్లు రైల్వేశాఖ వివరించింది.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై 3 కేసులు నమోదు



కరీంనగర్: బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ని నీది ఏ పార్టీ.. రాజీనామా చేసే దమ్ముందా? అంటూ నిలదీసిన ఘటనలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎమ్మెల్యే సంజయ్‌పై దురుసుగా ప్రవర్తించారని ఆయన పీఏ ఫిర్యాదు చేయడంతోపాటు సమావేశంలో గందరగోళం, పక్కదారి పట్టించారని ఆర్టీవో ఫిర్యాదు చేశారు. దీంతో కరీంనగర్‌లోని ఒకటో పట్టణ పోలీసులు వివిధ సెక్షన్ల కింద మూడు కేసులు నమోదుచేశారు. ఉమ్మడి కరీంగనర్ జిల్లా సమావేశం కరీంగనర్ కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతుండగా.. 'నువ్వు ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నవో చెప్పు.. పార్టీ మారిన నీకు మాట్లాడేహక్కు లేదు.. రాజీనామా చేసే దమ్ముందా?' అంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నిలదీశారు. 'నువ్వు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడివి. నీకు ఇక్కడ మాట్లాడే అర్హత లేదు. ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నవో చెప్పాలి? అంటూ ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు నెట్టుకుంటూ దూషించుకున్నారు.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీహెచ్ విజయరమణారావు, ఆది శ్రీనివాస్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మక్కాన్‌సింగ్ ఠాకూర్ తదితరులు కౌశిక్‌రెడ్డిని అడ్డుకున్నారు. ఆయనను వేదికపై నుంచి కిందికి నెట్టే ప్రయత్నం చేశారు. దీంతో వేదికపైనే ఉన్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకుని కౌశిక్‌రెడ్డిని బలవంతంగా కలెక్టరేట్ ఆడిటోరియం నుంచి లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డి తుల్లి వేదికపై ఉన్న కుర్చీలో పడిపోయారు. పోలీసులు బలవంతంగా ఎత్తుకెళ్లి ఆడిటోరియం బయట వదిలేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, కౌశిక్‌రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఎమ్మెల్యే సంజయ్.. పాడి కౌశిక్‌రెడ్డి ఛాతీపై చేయి వేసి నెట్టేశారు.సంజయ్‌కి దమ్ముంటే రాజీనామా చేయాలి.కేసీఆర్ పెట్టిన భిక్షతో ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు దమ్ముంటే రాజీనామా చేసి, కాంగ్రెస్ బీఫాంపై పోటీ చేసి గెలవాలని పాడి కౌశిక్‌రెడ్డి సవాలు చేశారు. తనపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేనైన తనను మంత్రుల సాక్షిగా కరీంనగర్ సమీక్షా సమావేశం నుంచి బయటకు లాక్కొచ్చారని ఆరోపించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి, అమ్ముడుపోయిన జగిత్యాల ఎమ్మెల్యేను'నీది ఏ పార్టీ?'అని అడిగితే.. 'కాంగ్రెస్ పార్టీ' అని చెప్తున్నాడని, అతనిపై స్పీకర్ అనర్హత వేటు వేయాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను విమర్శిస్తుంటే తాము చూస్తూ ఊరుకోలేమని స్పష్టంచేశారు. ఇలాంటి వారిని నిలదీస్తామని, అడుగడుగునా అడ్డుకుంటామని చెప్పారు. మూడేండ్ల తర్వాత మళ్లీ కేసీఆర్ సీఎం అవుతారని, ఇప్పుడు అతిగా ప్రవర్తిస్తున్న ప్రతి ఒక్కరిపై చర్యలు తప్పవని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సంజయ్ రాజీనామా చేసే వరకు ఇదే పరిస్థితి ఉంటుందని స్పష్టంచేశారు.

## మంచి ఆలోచనలతో మార్పు రావాలి: జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: భోగి మంటల్లో చెడు ఆహుతై మంచి ఉదయించాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. అందరి చెడు ఆలోచనలు భోగి మంటల్లో బూడిదవ్వాలని, సరికొత్త ఆలోచనలు, అభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సూర్యాపేట పట్టణంలోని పలు కూడళ్లలో జరిగిన భోగి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున చేరి భోగి మంటల కాంతుల మధ్య కోలాటం వేస్తూ ఆనందంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు.మార్పు మార్పు అనుకుంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాదంతా పేర్లు మార్చడంతోనే గడిచిపోయిందని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పాలకులకు కనువిప్పు కలగాలన్నారు. కేసీఆర్ లాంటి అభివృద్ధి ఆలోచనలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రావాలని చెప్పారు. పాడిపంటలు సమృద్ధిగా పండి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కేసీఆర్ హయాంలో గత పదేండ్లు బ్రహ్మండంగా అభివృద్ధి చెందిందని వెల్లడించారు. ఏడాది కాలంగా రేవంత్ పాలన మంచి ఫలితాలు పొందడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. పాలకుల చెడు ఆలోచనలు భోగి మంటల్లో కాలిపోయి మంచి ఆలోచనలతో మార్పు రావాలన్నారు. ప్రజల కష్టాలు తొలగించి ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు.

## భోగి వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్..



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి మొదలైంది. మకర సంక్రాంతికి ముందు రోజు వచ్చే భోగి పండుగను తెలుగు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. పిల్లలు, పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేసి సందడి చేశారు. సామాన్య ప్రజలతోపాటు సినీ, రాజకీయ ప్రముఖులు సైతం భోగి వేడుకల్లో పాల్గొన్నారు.ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఇంట్లో భోగి సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, ముఠా గోపాల్, బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్, పట్లోల్ల కార్తిక్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

**సంపాదకీయం**

**మంగళవారం 14-01-2025**

## మనం గుర్తించని మహా శాస్త్రవేత్త

ఆయన మానవ శరీరంలో విటమిన్ బి నిర్వహిస్తున్న అత్యంత కీలకమైన పాత్రను కనుగొన్నాడు. దాన్ని గుర్తించడమే కాదు, వెలికితీసి కృత్రిమంగా తయారు చేయడానికి మార్గం సుగమం చేశాడు. విటమిన్ బి ని ప్రజారోగ్యం కోసం ఇప్పటికీ ప్రపంచం ఉపయోగిస్తోంది. ఆయన పరిశోధన విటమిన్-12 తయారీకి దారితీసింది. దాన్ని కూడా నేడు ప్రపంచ వ్యాపితంగా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఆయన ఈ రోజు క్యాన్సర్ చికిత్సల్లో ముఖ్యంగా పిల్లల్లో వచ్చే ల్యుకేమియా చికిత్సలో కీలకమైన మెథొట్రెగ్జేట్ ఔషధాన్ని రూపొందించాడు. ఆయన ఉష్ణ మండలాల్లో దోమకాటు వల్ల వచ్చే బోదకాలు వ్యాధిని నయం చేసే మందు డిఇథైల్కార్బమజైన్‌ను కనుగొన్నాడు. ప్రపంచ వ్యాపితంగా బోదకాలు వ్యాధి నివారణలో ఇది అమోఘంగా పనిచేసింది. అన్నిటికీ మించి యాంటీబయాటిక్స్ తయారీలో ఆయన కృషి నేటికీ ఏనాటికీ ప్రపంచం ఆయనకు రుణపడి ఉంటుంది. విభిన్న రకాల బ్యాక్టీరియా వ్యాధులను నయం చేసే మందుల్లో ఉపయోగించే టెట్రాసైక్లిన్ అభివృద్ధిలో కీలక పాత్ర నిర్వహించాడు. ఇంత గొప్ప పరిశోధనలు చేసి మానవాళి ఆరోగ్యానికి మహోపకారం చేసిన ఆ వ్యక్తి డాఎల్లాప్రగడ సుబ్బారావు మన ఆంధ్రుడని, భీమవరంలో పుట్టి ప్రాథమిక చదువులు చదివి, మద్రాసులో ఉన్నత విద్యనభ్యసించి, అమెరికా వెళ్లి గొప్ప పరిశోధనలు చేసి ప్రపంచ ప్రజలకు కలకాలం ఉపయోగపడే పరమౌషధాలు తయారీకి తోడ్పడ్డాడని చాలా తక్కువ మందికే తెలుసు. నిజానికి యల్లాప్రగడ సుబ్బారావు చేసిన పరిశోధనలు, ఆయన కనుగొన్న ఆవిష్కరణలకన్నా తక్కువ చేసిన వారికి నోబెల్ బహుమతులు లభించాయి. ఆయన కన్నా తక్కువ కృషి చేసిన వారికి మన దేశంలో మరణానంతర భారత రత్న బిరుదులు లభించాయి. కానీ సుబ్బారావు పరిశోధనా ఫలితాలు నేటికీ అనుభవిస్తున్న ప్రపంచం గానీ, ఆయన భారతీయుడై పుట్టినందుకు మన దేశం గానీ ఆయనకు తగిన గుర్తింపు నివ్వలేదు. కారణం ఏమై ఉండొచ్చు?బహుశా యల్లాప్రగడ సుబ్బారావు భారతీయ సంతతికి చెందిన శాస్త్రవేత్త గనుక వందేళ్ల క్రితం పశ్చిమ దేశాల్లో నెలకొన్ని ఉన్న వివక్ష ఆయనకు నోబెల్ బహుమతిని దూరం చేసి ఉండవచ్చు, ఆయన భారత్‌లో పుట్టినా అమెరికాలో పరిశోధనలు చేశారు కాబట్టి మన దేశం ఆయనను విస్మరించి ఉండవచ్చు. కానీ ప్రపంచ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడ్డంలో చేసిన పరిశోధనలు, ఆవిష్కరణలకుగాను ఆయన సర్వ మానవాళికీ ప్రాతఃస్మరణీయుడుగా నిలిచిపోతాడు. ఈ రోజు యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి. ఆయన భీమవరం పట్టణంలో 1895 జనవరి 12వ తేదీన జన్మించి 1948 ఆగస్టు 8న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో 53వ ఏట కన్నుమూశారు. కేవలం 53 ఏళ్ల లోనే ఆయన అన్ని విజయాలు సాధించారంటే ఇంకా నిండు జీవితం గడిపి ఉంటే ఇంకా ఎన్ని గొప్ప ఆవిష్కరణలు చేసేవాడో కదా!సుబ్బారావు తండ్రి పేరు జగన్నాథం. చిరు ఉద్యోగిగా రిటైర్ అయ్యాడు. దాంతో సుబ్బారావు తల్లి పట్టుబట్టి రాజమండ్రికి పంపించి మెట్రిక్యులేషన్ చదివించింది. ఫెయిలయ్యాడు. ఇంతలో తండ్రి మరణించాడు. తల్లి పట్టుదలతో కొడుకు చదువు కోసం పుస్తెలు అమ్మి మద్రాసుకు పంపించింది. మద్రాసు హిందూ ఉన్నత పాఠశాలలో చేరి, చదువులో ముందడుగు వేశాడు. మద్రాసు ఇండియన్ మెడికల్ కాలేజీలో ఎల్.ఐ.ఎం చేసి, కార్పొరేషన్ ఆయుర్వేద హాస్పటల్‌లో నెలకు అరవై రూపాయల జీతం మీద పని చేశాడు. విదేశాలకు వెళ్లి పరిశోధనలు చేయాలని వైద్య శాస్త్రాన్ని శోధించి, పరిశోధించి అనేక రహస్యాలను తెలుసుకుని తీయాలనే దృఢమైన కాంక్షతో అమెరికా వెళ్లి హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో చేరి పరిశోధనలు చేపట్టారు. ఆయన భార్య పేరు శేషగిరి. మామ కస్తూరి సూర్యనారాయణ మూర్తి, సుబ్బారావు ఉన్నత చదువులకు ఆర్థికంగా సహకరించారు.హార్వర్డ్‌లో యల్లాప్రగడ సుబ్బారావు ఆవిష్కరణల పరంపర 1925లో ప్రారంభమైంది. సైరస్ ఫిస్కే అనే శాస్త్రవేత్తతో కలిసి ఆయన మానవ శరీరంలో ద్రవంలో భాస్వరం ఉండే కనుగొనే పద్ధతిని కనిపెట్టాడు. దీన్ని అప్పటి నుండి ఫిస్కే-సుబ్బారావు పద్ధతిగా పేర్కొంటున్నారు. తరువాత 1927లో ఫాస్ఫోక్రియాటైన్, 1929లో అడినోసిన్ ట్రిఫాస్ఫేట్ (ఎటిపి)లను ఆయన కనుగొన్నాడు. 1930లో ఆయన హార్వర్డ్ నుండి పిహెచ్‌డి పొందాడు. 1940 వరకు హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో టీచింగ్ ఫెలోగా పనిచేశాడు. తరువాత లెడర్లె లాబరేటరీలో రిసర్చ్ అసోసియేట్ డైరెక్టర్‌గా చేరి, 1942లో దాని డైరెక్టర్ అయ్యారు. ఈ కాలంలో ఆయన వైద్య రంగానికి సంబంధించిన నాలుగు అతి ముఖ్యమైన పదార్థాలను కనుగొన్నాడు. వాటిలో మొదటిది, టెట్రాసైక్లిన్ యాంటి బయోటిక్స్‌లో మొదటిదైన ఆరియోమైసిన్. తరువాత 1947లో బోదకాలు నయం చేసే హెట్రాజన్ (డైథీల్కార్బామజైన్ సిట్రేట్) కనుగొన్నాడు. 65 ఏళ్ల తరువాత ఇప్పటికీ ఈ మందును వాడుతున్నారు. తరువాత ఆయన కనుగొన్న మూడోది, విటమిన్-బి (ఫోలిక్ యాసిడ్). తరువాత ఆయన పరిశోధనలు విటమిన్-బి కనుగొనే వరకు వచ్చాయి. కానీ వాస్తవంగా ఆయన పరిశోధనలపై ఆధారపడి తరువాత దాన్ని కనుగొన్నారు. నాల్గవది, శరీర కణాల పెరుగుదలను నిలువరించి క్యాన్సర్‌ను నయం చేయగల అమినోప్టెరిన్‌ను ఆయన కనుగొన్నాడు.యల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్న ఈ మందులన్నీ దశాబ్దాలు గడిచిపోయినా నేటికీ ఉపయోగంలో ఉన్నాయంటేనే ఆయన ఆవిష్కరణల విశిష్టత అర్థమవుతుంది. ఇవే కాకుండా ఆయన కనుగొన్న విషయాలు చాలా ఉన్నాయి.మానవాళికి ప్రజలకు ఉపయోగపడే ఇంత గొప్ప పరిశోధనలు చేసిన సుబ్బారావు అవి ప్రజలకు ఉపయోగ పడాలనుకున్నాడే గాని వాటికి పేటెంట్లు ఆశించలేదు. అలా ఆశించి ఉంటే ఆయన శతకోటీశ్వరుడై ఉండేవాడు. అలాగే ఆయన ఎటువంటి గుర్తింపును కూడా ఆశించలేదు. నిజానికి గుర్తింపు కోసం తాపత్రయపడడం ఆయన నైజం కాదు. ''ఈ శతాబ్దానికి చెందిన ఒక గొప్ప వైద్య ఆలోచనాపరుడు'' అని సుబ్బారావు చనిపోయినప్పుడు ఆయన నుద్దేశించి హెరాల్డ్ ట్రిబ్యూన్ వ్యాఖ్యానించింది.వైద్య రంగంలో యల్లాప్రగడ సుబ్బారావు స్ఫూర్తి మంతమైన కృషిని, విజయాలనూ నేటి తరం యువతకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# విశాల ఎంపికలో రాష్ట్రాల పాత్ర శూన్యం

హైదరాబాద్,1956లో పార్లమెంటులో ఆమోదించబడిన చట్టం ద్వారా ఇది చట్టబద్ధతను సంతరించుకుంది. అప్పట్లో యుజిసి కేవలం నిధుల పంపిణీ, విశ్వవిద్యాలయాల పనిని వాటి మెరుగుదలను సమన్వయం చేసే కార్యక్రమాలను నిర్వహించేది. అయితే 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్‌ను తమ భావాలకు అనుగుణంగా మలుచుకోవాలని చాలా ప్రయత్నాలు చేశారు. అందుకు అనుగుణంగా 2018లో 1956లో చట్టానికి సవరణలు చేయడం కోసం చేసిన ప్రయత్నం తీవ్ర ప్రతిఘటనల ద్వారా విరమించుకుంది. అయితే ఆ చట్టం ముసాయి దాలోని నిబంధనలను అమలు చేయడానికి చూస్తున్నారు. భారతదేశం అమలులోకి వచ్చి 75 ఏళ్లు నిర్వహించబడింది ఇటు రాజ్యాంగ వ్యతిరేక తీర్మానాలు చేయడం ప్రజలను అవమానించడం తప్ప మరొకటి కాదు.'విద్యకు సంబంధించిన అంశం రాష్ట్రాలకు రావాలి. కేంద్రానికి సమన్వయం చేసే అధికారం ఎప్పటికీ ఉంటుంది. కానీ కేంద్రం మొత్తం తన చేతుల్లోకి తీసుకుంటే రాష్ట్రాల చొరవ దెబ్బ తింటుంది. అయితే సాంకేతిక, వృత్తిపరమైన, విజ్ఞాన సంబంధిత సంస్థలు, విద్యాలయాలు కేంద్రంగా ఉంటాయి. అంతకు మించి ఆలోచించడం సరికాదు" అంటూ రాజ్యాంగ సభ సభ్యులు కృష్ణమాచారి రాజ్యాంగ సభలో స్పష్టం చేశారు. విద్యకు సంబంధించిన అంశం కేంద్రం లేదా ఉమ్మడి జాబితాలోకి పలువురు సభ్యులు చేసిన సూచనలను ఆయన వ్యతిరేకించారు. ఆయన ప్రతిపాదించినట్లుగానే విద్య రాష్ట్రాలకు వచ్చింది. కృష్ణమాచారి రాజ్యాంగ రచన సంఘం సభ్యులు కూడా.అందుకే రచన సంఘం తరపున ఆయన తన వాదనను వినిపించారు. అయితే 1970లో జరిగిన 42వ రాజ్యాంగ సవరణ ప్రకారం విద్య ఉమ్మడి జాబితాలోకి వెళ్లింది. అయినప్పటికీ అది కేంద్రం మొత్తం గుత్తాధిపత్యం కిందికి వెళ్లలేదు. అప్పటి నుంచి కూడా రాష్ట్రంలో నడుస్తున్న విశ్వవిద్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వ పాలనలోనే ఉండేవి. కేంద్రం తమ బడ్జెట్‌లో, పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పడిన విశ్వవిద్యాలయాలు మాత్రం కేంద్రం పరిపాలనలో ఉండేవి. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలోని విశ్వవిద్యాలయం తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. గత మూడు రోజుల క్రితం యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యుజిసి) జారీ చేసిన చర్చా పత్రం ఎన్నో విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికే రకరకాలుగా యుజిసి ద్వారా కేంద్రం తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి పూనుకుంటున్నది. ప్రస్తుతం చర్చ కోసం విడుదల చేసిన పత్రంలో చాలా విషయాలు ఉన్నప్పటికీ, విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకం చాలా విమర్శలకు తావిస్తున్నది.నూతనంగా రూపొందించిన నిబంధనల ప్రకారం రాష్ట్ర గవర్నర్ ముగ్గురు సభ్యుల పానెల్‌ను నియమిస్తారు. ఇందులో ఛాన్సలర్‌గా గవర్నర్ నామినేట్ చేసిన వ్యక్తి, పానెల్ ఛైర్మన్, రెండవ వ్యక్తి యుజిసి నామినేట్ చేసిన ప్రతినిధి, మూడవ వ్యక్తి విశ్వవిద్యాలయం నుండి ఒకరు ఉంటారు. ఇందులో గవర్నర్ నామినేట్ చేసిన వ్యక్తి ఛైర్మన్‌గా ఉంటారు. అక్కడ రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వమే సెర్చ్ కమిటీలను వేసేది. ఆ కమిటీ ముగ్గురు ప్రాధాన్యత కలిగిన సభ్యుల జాబితాను ఛాన్సలర్ అయిన గవర్నర్‌కు పంపితే అందులో ఒకరిని వైస్ ఛాన్సలర్‌గా నియమించేవారు. అయితే ఇది రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే నిర్ణయించేది. గవర్నర్ పాత్ర కేవలం నామమాత్రమే.ఆ రాష్ట్ర ప్రభుత్వంలోనే రాష్ట్ర విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల ఎంపిక జరుగుతుంది. అయితే ఈ కొత్త నిబంధనల ప్రకారం ఇక ఎంత మాత్రం రాష్ట్రాలకు అటువంటి అధికారం ఉండదు. అంటే ఉన్నత విద్యలో రాష్ట్రాల పాత్ర శూన్యం కానున్నది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా భిన్నమైనది.అదే విధంగా విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లను గతంలో లాగా విశ్వవిద్యాలయాలలో నిర్ణీత కాలం బోధనలో ఉండి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగిన వాళ్లను ఏరి ఎంపిక చేసే సాంప్రదాయం ఉండేది. కానీ ఇప్పుడు దానిని సడలించి విశ్వవిద్యాలయాలకు బయట ఉన్న వ్యక్తులు, పారిశ్రామికవేత్తలు, ఇతర సామాజిక రంగంలో ఉన్న వాళ్లను నియమించే అవకాశం కూడా ఈ కొత్త నిబంధనల్లో చేర్చారు. ఇది మరింత శోచనీయం. దీని ద్వారా ఎవరైతే అధికారంలో ఉంటారో వారి మనుషులకు విద్యకు సంబంధం లేని వారిని వైస్ ఛాన్సలర్లుగా నియమించుకునే విస్తృత అధికారాలు ఈ నిబంధనలు అందజేస్తాయి. ఇందులో రెండు అంశాలున్నాయి. ఇక ఇప్పటి బిజెపి ప్రభుత్వం తమ భావజాలంతో ఉన్నవాళ్లను నింపాలనుకోవడం మొదటిది. నాకు తెలిసి అర్హులైన ప్రొఫెసర్లు, వాళ్ల భావాలతో ఉన్న వాళ్లు దొరికే అవకాశం కనిపిస్తున్నట్టు లేదు. అందువల్ల అనర్హులను నియమించాలనుకుంటున్నారు. ఇది విశ్వవిద్యాలయాల స్థాయిని అధోఃపాతాళానికి దిగజారుస్తుందనడంలో సందేహం లేదు. రెండోది పారిశ్రామికవేత్తలను నియమించడం వల్ల క్రమంగా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న విశ్వవిద్యాలయాలను ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఉచితంగా అందజేసే కుట్ర కనిపిస్తోంది. ఒకవైపు తమ భావజాల ఎజెండాను విశ్వవిద్యాలయాల్లోకి సంపూర్ణంగా, అధికారికంగా ప్రవేశపెట్టడంతోపాటు ధనికులకు, వ్యాపారస్థులకు విశ్వవిద్యాలయాలను ధారదత్తం చేసే అవకాశం ఉంది. ఇది సందర్భం కాకపోయినా ఇక్కడ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రస్తావించిన వెంటనే చెప్పాలని ఉంది. "భారత దేశ ప్రజలకు పెట్టుబడిదారీ విధానం, బ్రాహ్మణిజం రెండు ఉమ్మడి శత్రువులు" అన్న మాటలను బిజెపి ప్రభుత్వం నిజమే అని నిరూపిస్తున్నది.వీటితోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకంలో కూడా గతంలో ఉన్న నిబంధనలను సడలించింది. గతంలో ఉన్నత విద్యతో పాటు నీట్ నుంచి పరీక్ష పాసైన వాళ్లకు, పిహెచ్‌డి చేసిన వాళ్లకు విశ్వవిద్యాలయాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రవేశం ఉంటే ఇప్పుడు ఆ నిబంధనలను సడలించింది. ఇది కూడా తమ మనుషులను విశ్వవిద్యాలయాల్లో నింపుకునే ప్రయత్నమేననే బలమైన విమర్శ ఉన్నది.విద్యా వ్యవస్థను ఇప్పటికే గత పదేళ్ల బిజెపి ప్రభుత్వం తన భావజాలంతో ఎన్నో ప్రయత్నాలు చేసింది. కేవలం విశ్వవిద్యాలయాలే కాదు, పరిశోధన, అధ్యయన సంస్థల్లో తమ మనుషులతో నింపివేసింది. ఇటీవల యుజిసి ఛైర్‌పర్సన్‌గా నియమించిన వ్యక్తికి, బిజెపి భావజాలంతో ఉన్న సంబంధాలు జగద్విదితమే. అందువల్లనే యుజిసి ఇటువంటి రాజ్యాంగ విరుద్ధమైన నిబంధనలను రూపొందించి, గందరగోళం సృష్టిస్తున్నది.గతంలో కూడా యుజిసి ఎస్‌సి, ఎస్‌టి, బిసిల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా రూపొందించిన సర్క్యుల తీవ్ర ప్రతిఘటన తర్వాత వెనక్కు తీసుకున్నది. ప్రభుత్వమే దాని మీద జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యుజిసి) ఏర్పాటు, దాని పని విధానానికి మించి తన కార్యక్రమాలను విస్తరిస్తున్నది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిటి 1945లో అప్పటి జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలైన అలీఘడ్, బనారస్, ఢిల్లీ విశ్వవిద్యాలయాల పని తీరును సమన్వయం చేసి, నిధులను సమకూర్చి ఏర్పాటైంది. 1947లో ఇది ఇతర జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలకు విస్తరించింది. ఇది బ్రిటిష్‌లోని యుజిసి తరహాలో రూపొందించారు. అయితే 1953లో అప్పటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్ రూపంలో. 1956లో పార్లమెంటులో ఆమోదించబడిన చట్టం ద్వారా ఇది చట్టబద్ధతను సంతరించుకుంది.అప్పట్లో యుజిసి కేవలం నిధుల పంపిణీ, విశ్వవిద్యాలయాల పనిని వాటి మెరుగుదలను సమన్వయం చేసే కార్యక్రమాలను నిర్వహించేది. అయితే 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్‌ను తమ భావాలకు

# యుద్ధ అనాథల జీవితాల్లో 'కాంతిరేఖ'



న్యూఢిల్లీ,ప్రతి యుద్ధానికి అనాథలు ఉంటారు. ప్రతి సంఘర్షణ దాని మచ్చలను అమాయకులపై వదిలేస్తుంది. ఈ మాట ప్రపంచంలో గతంలో జరిగినా, వర్తమానంలో జరుగుతున్నా, భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలు మిగిల్చే కన్నీటి గాథల గురించి. యుద్ధాలు మిగిల్చే విషాదంలో అత్యంత భయానకమైన జీవితాలు అనాథలదే. అహంకారపూరితమైన ఆధిపత్యం కోసం, సంఘర్షణల కారణంగా జరుగుతున్న యుద్ధ భూమిలోని పోరు కోట్లమంది అనాథలను మిగిల్చిపోతుంది. ఈ కన్నీటి ఆవేదనకు ముగింపు ఎక్కడో తెలియక బిక్కుబిక్కుమంటున్న అనాథ పిల్లలు కారుస్తున్న కోట్ల క్యూసెక్కుల కన్నీరు కారకులెవ్వరో...అన్ని దేశాలకు తెలిసిన వారికి అడ్డుకట్ట వేసి శాంతి మార్గం వైపు నడిపించేందుకు ఆయా దేశాలు ఇప్పటికీ సమాయత్తం కాకపోవడం మానవ సమాజంలో ఓ విషాద పరిణామం. గత రెండు మూడు సంవత్సరాల నుండి పలు దేశాలు, వర్గాల మధ్య జరుగుతున్న యుద్ధాలు సంఘర్షణలో లక్షలాది మంది పిల్లలు అనాథలుగా మారుతున్నారు. గాజా -ఇజ్రాయెల్, రష్యా- ఉక్రె, ఆర్మేనియా %-% అజర్ బైజాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇథియోపియాలోని టిగ్రే ప్రాంతాల మధ్య యుద్ధాలు, ఘర్షణల కారణంగా యుద్ధ అనాథల సంఖ్య పెరుగుతోంది. యూనిసెఫ్ లెక్కల ప్రకారం యుద్ధాలు మిగిల్చిన విషాదం కారణంగా 140 మిలియన్లకు పైగా అనాథలుండగా, అత్యధికంగా ఆసియా ఖండంలోనే 61 మిలియన్ల మంది అనాథలు ఉన్నారు. 18 శతాబ్దం నుండి 20వ శతాబ్దం ప్రారంభంలో జరిగిన యుద్ధాల్లో బాధితుల సంఖ్య 2001 వరకు క్రమంగా పెరిగింది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ సమయాల్లో అధికారిక అంచనాల ప్రకారం పోలాండ్‌లో 30 లక్షల మంది, యుగోస్లేవియాలో 2 లక్షల మంది పిల్లలు అనాథలు అయినట్లు లెక్కలు తేలాయి. ప్రపంచ యుద్ధాలలో 1990 నాటికి అనాథ బాధితుల సంఖ్య 146 మిలియన్లుండగా, 1995 నాటికి 151 మిలియన్లు, 2000 నాటికి 155 మిలియన్ల బాధితులు చేరుకోవడం విషాదకరమైన పరిణామం. సేవ్ ది చైల్డ్రన్ లెక్కల ప్రకారం ప్రపంచంలో ఆరు మంది పిల్లల్లో ఒక్కరు యుద్ధాలు, వర్గాల సంఘర్షణ జోన్‌లో స్థాపించారు. ప్రపంచంలోని పది దేశాలు ఆఫ్ఘనిస్తాన్, కాంగో, సిరియా, యెమెన్, సోమాలియా, మాలి, నైజీరియా, కామెరూన్, సూడాన్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ దేశాల్లో పిల్లలు ఈ ఘర్షణల కారణంగా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నారని అంతర్జాతీయ బాలల హక్కుల సంఘం ప్రకటించింది. సూడాన్‌లో ప్రతి వంద మంది చిన్నారుల్లో 10 మంది అనాథాశ్రమాల్లో మగ్గుతున్నారు.ఇటీవల రష్యా సుమారు 14 వేల మంది ఉక్రెయిన్ పిల్లలను విడిచిపెట్టి తమ యుద్ధాలకు తరలించుకుపోయినట్లు తెలుస్తుంది. ప్రపంచంలో ప్రతి దేశంలో ఏదో ఒక రూపంలో జరిగిన యుద్ధాలు, ఘర్షణల ఫలితంగా తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలు అనాథలుగా, జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు. ప్రపంచంలోని యుద్ధ అనాథల సంక్షేమానికి ఎస్ఓఎస్ ఎన్ఫాంట్స్ ఎన్ డెట్రాసెస్ అనే ఫ్రెంచ్ సంస్థ నడుం బిగించింది. ప్రతి సంవత్సరం యుద్ధ అనాథల దినోత్సవాన్ని (వరల్డ్ డే ఆఫ్ వార్ ఆర్ఫాన్స్) నిర్వహిస్తుంది. యుద్ధాల సమయంలో అనాథలైన పిల్లల గురించి అవగాహన కల్పించడం, పిల్లల మానవ హక్కులను పరిరక్షించేలా కార్యక్రమాలు రూపొందించడంతో పాటు బలహీన వ్యక్తులకు మద్దతు, రక్షణ అవసరాన్ని చాటిచెప్పేలా చేయడం, వారి అవసరాలను తీర్చి ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఈ సంస్థ పనిచేస్తుంది. మిగిలిన పిల్లలలాగే యుద్ధంలో అనాథలైన పిల్లలు కూడా తమ హక్కుల కోసం, స్వేచ్ఛగా జీవించాల్సిన భరోసా, తమ హృదయాల్లో పడిన గాయాలు తొలగేలా సమాజ జీవితంలో వారిని ఉన్నతంగా ఎదిగేలా చేయాల్సిన బాధ్యత ప్రపంచంలోని అన్ని దేశాలకు ఉంది. సమష్టిగా ప్రపంచ దేశాలు చేతులు కలిపి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. యుద్ధనాథలు అనారోగ్యం బారినపడటంతో పాటు దొంగతనంగా, మానవ అక్రమ రవాణా చేస్తున్నారు. భిక్షాటన ముఠాలు వారిని ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. కొన్ని దేశాలు ఈ బాలలను బాల సైనికులుగా మార్చి యుద్ధ భూమిలో బలి పశువులను చేస్తున్నారు. ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం అంటే జ్ఞాపకార్థం కోసమో, స్మరించుకొనే రోజే కాదు. ఇది అనాథల కోసం అండగా నిలిచే చర్యలకు, సహాయాలకు నడుం కట్టే పిలుపు. యుద్ధంలో తమ తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లవాడి ఆక్రందను, హృదయ గాయాలను మాన్పించే సమష్టి సమాజం కోసం పయనించాల్సిన సందర్భాన్ని ఎలుగెత్తి చాటే ఓ ఓదార్పు. సంఘర్షణకు గురైన అమాయక బాధితులకు ఓ వెలుగునిచ్చే ప్రయాణం కోసం అడుగులు వేయాల్సిన మానవీయ కోణం. కోట్ల మంది యుద్ధ అనాథ బాలల ఉజ్వల భవిష్యత్ కోసం అవగాహన పెంచడానికి ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం వారి జీవితాల్లో ప్రేమను పంచే ఓ కాంతిరేఖ. 'ప్రపంచంలో చాలా మంది చిన్నరొట్టె ముక్క కోసం చనిపోతున్నారు, కానీ చిన్నప్రేమ కోసం ఇంకా చాలా మంది చనిపోతున్నారు' అన్న మదర్ థెరిస్సా వాక్కులు ఒక్కసారి గుర్తుచేసుకోవాల్సిన సందర్భం ఇది.

# ఆదివాసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి

నల్లగొండ,ఆదివాసీల కోసం చట్టాలు చేసి వాటిని అమలు చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇక, చట్టాలను అమలు చేయించుకునే బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను తూచా తప్పకుండా అమలు చేసే బాధ్యత నాది అని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టే.. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు అవుతుంది.. ఎస్సీ, ఎస్టీ సబ్ ఎ÷-లాన్ నిధులను పకడ్బందీగా ఖర్చు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ లో ఆదివాసి ప్రజా ప్రతినిధుల సాధికారత శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఒక లక్ష రూపాయలు అదనంగా ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారుల్లో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉంటారు.. ఒక్క రక్తం చుక్క బయటకు రాకుండా పేదల కోసం తెచ్చిన గొప్ప పథకం ఉపాధి హామీ పథకం.. పోసా చట్టన్ని, ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఇక, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రైతు బంధు ఉండదని బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేసింది.. కానీ, తాము అధికారంలోకి వచ్చాక మారో 2 వేలు అదనంగా కలిపి మొత్తం 12 వేల రూపాయలను ఇవ్వబోతున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, కాంగ్రెస్ నేత కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి తొక్కిసలాటలో అసలు దోషి చంద్రబాబే

తిరుపతి,తిరుపతి తొక్కిసలాట ఘటనలో అసలు ముద్దాయి సెం చంద్రబాబు నాయుడు అని మాజీమంత్రి ఆర్‌కె రోజా అన్నారు. తొక్కిసలాటతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్న సిఎం, డిప్యూటీ సిఎంకు బుద్ధిరాలేదని అన్నారు. చంద్రబాబు తన మనుషులను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, భక్తుల మీద ప్రేమ, అనుభవం లేనివారికి పదవులు ఇస్తున్నారని రోజా వ్యాఖ్యానించారు.హిందూవులంటే చంద్రబాబుకు గౌరవం లేదా అని రోజా ఆరోపణలు చేశారు. వెంకయ్య ' చౌదరి' కావడాన్నే పదవి ఇచ్చారా? తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయినా చంద్రబాబు మేల్కో లేదని, తిరుపతి తొక్కిసలాటలో మొదటి ముద్దాయి చంద్రబాబు అనే ఆమె అన్నారు. సరైన సంఖ్యలో పోలీసులను పెడితే తొక్కిసలాట జరిగేది కాదని, ఈ హత్యలు కూటమి ప్రభుత్వం చంద్రబాబు చేసినవేనని, లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని మీకు తెలియదా? మద్యం పాలసీని మారుస్తారు కానీ టోకెన్ సిస్టం ను మార్చరా?? అని ప్రశ్నిచారు. తొక్కిసలాటకు బాధ్యులైన వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు బుక్ చేయలేదు? అని రోజా మండిపడ్డారు. తొక్కిసలాటకు కారణమైన వారి తోలు ఎందుకు పవన్ తీయడం లేదు?? చౌదరి, బిఆర్ నాయుడ్ని శిక్షించడానికి పవన్ ఎందుకు భయపడుతున్నారని, కులం చూసి భయపడను అనే పవన్ ఇప్పుడెందుకు భయపడుతున్నారు. ఎస్పీ, టిటిడి పాలక మండలితో సహా అందరీపై కేసులు పెట్టాలని తిరుపతి తొక్కిసలాటను కోర్టులు సుమోటో తీసుకోవాలని తెలిపారు. తొక్కిసలాట తరువాత భక్తులు భయపడి దైవ దర్శనానికి కూడా రాలేదని, హిందూత్వాన్ని, మన దేవుళ్లను కాపాడుకోవడానికి స్వామిజీలు ఉన్నారన్నారు. పిఠాపురంలో మణికంఠ, చరణ్ కుటుంబాలను పవన్ ఎందుకు పరామర్శించలేదని వైసిపి మాజి మంత్రి రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. చెప్పాల్సింది క్షమాపణలు కాదు..బాధ్యులను శిక్షించాలన్నారు. టిటిడి ఛైర్మన్, ఈవో, జేఈవో తప్పు చేశారని పవనే చెప్తున్నారని రోజా స్పష్టం చేస్తున్నారు.

## కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిస్తున్నారు

ఖమ్మం,కెటిఆర్ లొట్టపీసు భాషను ప్రజలు గమనిసతున్నారని, ఆయనకు ఎలా బుద్ధి చెప్పాలో వారికి తెలుసని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిఎంను తిడుతూ వాడుతున్న భాష ఆయన దిగజారుడు రాజకీయాన్ని సూచిస్తోందన్నారు. మా ప్రభుత్వం ఏ ఒక్కరి మీద కక్ష్యపూరితంగా చర్యలు చేపట్టడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కారు రేసింగ్ లో చట్టం తన పని తానే చేసుకుని పోతుంది.. కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డినీ లొట్టపీస్ ముఖ్యమంత్రి అన్నారు ఆయన బాషకు నమస్కారం.. ఆయన మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారు.. విచారణ కాకుండా ఈ ప్రభుత్వం ఏ ఒక్కరినీ అరెస్టు చేయదు.. అది బండి సంజయ్ కి కూడ బాగా తెలుసు.. విచారణ లేకుండా ఈ ప్రభుత్వం ఎవరిని అరెస్ట్ చేయరు.. ఏసీబీ రంగంలోకి రాగానే ఈడీ ఎంటర్ వచ్చింది.. స్టేట్ గవర్నమెంట్ పొల్యూట్ అయిందంటే కేంద్ర ప్రభుత్వం కూడా ఈడీ కూడా ఎందుకు రంగంలోకి వచ్చింది.. అందులో అవినీతి జరిగిందని రుజువైంది కాబట్టి ఈడీ రంగంలోకి వచ్చింది అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతికి ముందే అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేని వారు ఎవరో రెచ్చగొడితే వాళ్ల మాటలు విని మీరు అభద్రతకు లోనూ కావొద్దని చెప్పుకొచ్చారు. అలాగే, ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగు హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఇక, రైతు బంధు ఇవ్వలేదని, ఇళ్లు ఇవ్వలేదని మాజీ ముఖ్యమంత్రి టీం దుష్ప్రచారం చేస్తుంటుంది.. వారి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దు అని చెప్పారు. అలాగే, యోగ్యమైన భూమి ఉన్న వారందరికీ రైతుబంధు అందిస్తాం.. కానీ, రియల్ ఎస్టేట్ భూములకి మాత్రం ఒక్క రూపాయి కూడా ఈ ప్రభుత్వం చెల్లించదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.ఇక, రైతు బంధు విషయంలో ఎవరు అభద్రతకు లోనూ కావొద్దు అందరికీ ప్రభుత్వ పథకాలు వస్తాయని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపుల్లో ప్రత్యర్థులు రెచ్చగొట్టే చర్యలకు మీరు లోనూ కావద్దు.. గత ప్రభుత్వంలో ఇల్లు కట్టి వదిలేసిన అన్ని ఇండ్లని పూర్తి చేసి ప్రజలకి అందిస్తాం.. మొదటి విడతగా 3,500 ఇస్తున్నాం.. గ్రామ కమిటీలో అర్హులైన వారికి ఇల్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

### నేటినుంచి పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్

హైదరాబాద్, సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మూడు రోజుల పాటు కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందినవారు ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. ఇండోనేషియా, శ్రీలంక, నేపాల్, స్కాట్‌లాండ్, మలేషియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ప్లేయర్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివెల్ ఉంటుందన్నారు.

## తిరుమల అటవీ ప్రాంతంలో చిరుత సంచారం

తిరుమల,తిరుమలలో చిరుత సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. అలిపిరి వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న టీటీడీ ఉద్యోగికి చిరుత కనిపించింది. చిరుతను చూడగానే అతను తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో బాధితుడికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న టీటీడీ అధికారులు అప్రమత్తమయ్యారు. చిరుత సంచారంపై భక్తులను అప్రమత్తం చేశారు. అలిపిరి సమీపంలో చిరుత సంచరిస్తున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. భక్తులందరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు. మరోవైపు చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులకు టీటీడీ సిబ్బంది సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫారెస్ట్ అధికారులు.. చిరుత కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాన్ని పట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాప్ కెమెరాలు అమర్చడం సహా బోన్ ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చిస్తున్నారు.

## తిరుపతి తొక్కిసలాట బాధితులకు పరిహారం

తిరుపతి,తిరుపతి తొక్కిసలాట ఘటనలో బాధితులకు పరిహారం పంపిణీ కోసం తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు.. బోర్డు సభ్యులతో రెండు బృందాలను నియమించారు. మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి ఆదివారం నుంచి ఈ బృందాలు పరిహారం చెక్కులు అందజేయనున్నాయి. విశాఖ, నర్సీపట్నం వెళ్లే బృందంలో బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, పనబాక లక్ష్మి, జానకీదేవి, మహేందర్‌రెడ్డి, ఎం.ఎస్ రాజు, భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు. తమిళనాడు, కేరళ వెళ్లే బృందంలో శ్రీరామమూర్తి, కృష్ణమూర్తి వైద్యనాథన్, నరేష్ కుమార్, శాంతారాం, సుచిత్ర ఎల్ల ఉన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున, కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వనున్నారు. మృతుల కుటుంబాల్లో పిల్లలకు విద్య అందించేందుకు వివరాలు సేకరించనున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరికి రూ.5 లక్షలు చొప్పున, గాయపడిన 31 మందికి రూ.2లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నారు.

## ఉస్మానియాపై అధికారులతో సమీక్ష

హైదరాబాద్, ఈ నెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసు కున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు పక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భగా గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించి శాఖల మధ్య భూ బదలాయింపు పక్రియ, ఇతర పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన ఉస్మానియా ఆసుపత్రి, ఇతర నిర్మాణాలకు సంబంధించి నమూనా మ్యాప్ లను సీఎంకు వివరించిన అధికారులు. పలు మార్పులు, చేర్పులను రేవంత్ రెడ్డి సూచించారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీఎం.. ప్రతి ఒక్కరూ ఊరెల్లి నలుగురితో కలవాలి.. ఇక, రాబోయే 50 ఏళ్ల కాలానికి గాను అవసరాలను అంచనా వేసి కొత్త ఆసుపత్రిని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆసుపత్రికి నలువైపులా రహదారులు ఉండేలని చూడాలన్నారు. చికిత్స కోసం అన్ని జిల్లాల నుంచి ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కనెక్టివిటీ రోడ్లను డెవలప్ చేయాలని సూచించారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాలను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

## భగ్నం చేసిన సరిహద్దు బలగాలు

మాల్దా,బంగ్లాదేశ్‌కు చెందిన సాయుధ మూకల స్మగ్లింగ్ యత్నాలను భారత్ సైన్యం భగ్నం చేసింది. శనివారం తెల్లవారు జామున 2.10 సమయంలో దాదాపు 15-20 మంది సాయుధులు భారత్‌లోకి చొరబడే ప్రయత్నం చేశారు. పసిగట్టిన సరిహద్దు భద్రతా సిబ్బంది వారిని పలుమార్లు హెచ్చరించినా వినిపించుకోకుండా సరిహద్దు వైపు దూసుకొచ్చారు. జవాన్ల కళ్లు బైర్లు కమ్మేలా అత్యంత శక్తివంతమైన కాంతిని ప్రసరించే హై బీమ్ ఫ్లాష్‌లైట్లను వినియోగించారు. అంతలోనే జవాన్లపై మారణాయుధాలతో దాడికి దిగారు. తొలుత వారిని భయపెట్టేందుకు జవాన్లు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా వెనక్కి తగ్గకపోవడంతో ఆత్మరక్షణ కోసం బీఎస్ఎఫ్ సిబ్బంది కూడా ప్రతిదాడి చేశారు. దీంతో వారంతా తోకముడుచుకొని తిరిగి బంగ్లాదేశ్‌వైపు పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా.. 572 సీసాల ఔషధాలు,హైబీమ్ ఎ÷-లాష్‌లైట్లు, ఆయుధాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు బీఎస్ఎఫ్ ఉన్నతాధికారులు ప్రకటన విడుదల చేశారు. మరోవైపు ముర్షీదాబాద్, మాల్దా జిల్లాల పరిధిలోని బంగ్లాదేశ్ సరిహద్దు గుండా అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించేందుకు బంగ్లాదేశీయులు చేసిన ప్రయత్నాలను బీఎస్ఎఫ్ సిబ్బంది భగ్నం చేశారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రవేశించేందుకు అవకాశమున్నందున నందన్‌పుర్, ఫార్జిపరా, హరినాథ్‌పుర్, చురియంత్‌పుర్ అవుట్‌పోస్టుల్లో భద్రతను బీఎస్ఎఫ్ మరింత కట్టుదిట్టం చేసింది.

# ఇండియా విచ్ఛిన్నమైపోయినట్లేనా?

న్యూఢిల్లీ,ఇండియా మూడునాళ్ల ముచ్చటే అని కూటమి తేలిపోయింది. విభిన్న సిద్ధాంతాలు, అభిప్రాయాలు గల దాదాపు 24 పార్టీలు ఏకంకావడమే అరుదు. జెడి(యు) అధినేత నితీష్ కుమార్ సూచనతో కేంద్రం బిజెపిని 2024 పార్లమెంటు ఎన్నికలలో ఓడించడమే లక్ష్యంగా కూటమి ఏర్పడింది. అనూహ్యంగా కాంగ్రెస్ కూటమిలో పెద్దన్నపాత్ర వహించాల్సి వచ్చింది. కూటమి కన్వీనర్‌గా నితీశ్ కుమార్‌ను ఎన్నుకోవాలన్న భావన అదిలోనే దెబ్బతింది. ఫైర్ బ్రాండ్‌గా పేరుపొందిన మమతా బెనర్జీ మొదటినుంచి ఇండియా కూటమిపట్ల పెద్దగా ఆసక్తి చూపలేదు. కాంగ్రెస్ పెత్తనం ఆమెకు అసలే ఇష్టం లేదు. ఇక కమ్యూనిస్టులు అంటే ఎప్పుడూ చుక్కెదురే.కూటమిలో లెఫ్ట్ పార్టీలతో సహ భాగస్వామిగా ఉండేందుకు విముఖత చూపారు. ఇక బెంగాల్‌లో అసెంబ్లీ అయినా, పార్లమెంటు ఎన్నికలు అయినా ఏ ఎన్నికల్లో అయినా ఒంటరిపోరే తమ సిద్ధాంతంగా ఎంపిక చేస్తారు. కాంగ్రెస్‌కు 2 పార్లమెంటు స్థానాలు కూడా ఇచ్చేందుకు అంగీకరించలేదు. బెంగాల్‌లో 34 ఏళ్లు అధికారంలో ఉన్నా.. నానాటికీ దిగజారిపోయాయి వామపక్షాలు. బెంగాల్‌లో 48ఏళ్లుగా అధికారానికి దూరమై ఏటికాయేడు పతనమై.. ప్రస్తుతం నామమాత్రంగా మిగిలిన కాంగ్రెస్, కమ్యూనిస్ట్ లతో కలిసి కనీసం ఏ ఎన్నికలలోనూ విజయాన్ని అందుకోలేకపోయారు. పార్లమెంటు ఎన్నికల నాటికి కూటమిలో కీలక పార్టీలు బిజెపికి దీటుగా ఒకే ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలన్న లక్ష్యం మసక బారిపోయింది. ఆమ్‌ఆద్మీ పార్టీ కేజ్రీవాల్ పరిస్థితి మరోలా ఉంది. ఇష్టం లేకుండానే కూటమిలో చేరినట్లు కన్పించారు. లోక్‌సభ ఎన్నికల నాటికి ఢిల్లీలో పొత్తు.. పంజాబ్‌లో లేదు అన్నట్లు వ్యవహరించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ తీరు మరోలా ఉంది. కాంగ్రెస్‌తో ఉన్నట్లే ఉన్నా.. ఆ పార్టీకి చెక్ పెట్టే ధోరణిలోనే వ్యవహరించారు.మధ్యప్రదేశ్‌లో కనీసం స్థానాల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ అనుకూలంగా పూర్తిగా దూరమయ్యారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర ఓటమితో ఆ పార్టీపై ప్రతిపక్షాలలో ముఖ్యంగా కూటమి పార్టీలలో పూర్తిగా నమ్మకం పోయింది. కాంగ్రెస్‌కు దాదాపు అన్ని పార్టీలు దూరమయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్ కలిసినా, మహబూబా ముఫ్తీ ఒంటరి పోరుకు సిద్ధమయ్యారు. వయో భారం, అనారోగ్యం కారణంగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ అంత చురుగ్గా రాజకీయాల్లో పాల్గొనడం లేదు. ఎన్సిపిను అజిత్ పవార్‌వర్గం చీల్చిన తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరద్ పవార్ ఇంటికే పరిమితమయ్యారు. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ఇండియా కూటమి పూర్తిగా రద్దయి పోయినట్లయింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ రెండు టర్మ్‌లుగా అధికారంలో ఉంటోంది.పదేళ్లుగా కాంగ్రెస్ ఒక అసెంబ్లీ స్థానం కూడా గెలవలేదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బిజెపి, ఆమ్‌ఆద్మీ పార్టీకి డైరెక్ట్ ఫైట్‌గా కన్పిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమైంది. ఢిల్లీలో బిజెపి అధికారంలోకి రాకుండా చూడాలంటే.. ఆమ్‌ఆద్మీ పార్టీకి గంపగుత్తగా మద్దతు ఇవ్వడానికి ఇండియా కూటమిలో కీలక పార్టీలు నిర్వహిస్తున్నాయి. దీంతో సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్,




ఆర్జెడి, శివసేన ఉద్ధవ్ పార్టీ ఆమ్‌ఆద్మీ పార్టీకే మద్దతుగా నిలిచాయి. దీంతో కాంగ్రెస్ ఏకాకి అయింది. ఆ పార్టీకి ఆఖరుకు నేషనల్ కాన్ఫరెన్స్ కూడా దూరమైంది. ఇండియా కేవలం పార్లమెంటు ఎన్నికల కోసం కూటమి ఏర్పడిందని ఆయన కూడా చెప్పారు. దీంతో ఇండియా కూటమి ముక్కచెక్కలైనట్లు స్పష్టమైంది. కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం కాలే%ా% భవిష్యత్‌లో. ప్రతిపక్షాల ఐక్యత అసాధ్యమే అని తేలిపోయింది.

## టోల్‌గేట్ల వద్ద గంటలతరబడి క్యూలు

హైదరాబాద్/విజయవాడ,సంక్రాంతి పండగ సందర్భంగా నగరవాసులు వాహనాల్లో సొంతూళ్లకు క్యూకట్టడంతో.. దాదాపు అన్ని రూట్లలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏటా ఇదేతంతు కనిపించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు విజయవాడ రహదారిలో రిపేర్లు కూడా వాహనదారులకు పరీక్ష పెట్టాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కడంతో ఆయా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. శనివారం నుంచి సెలవులు ప్రారంభం కావడంతో ఇటు విజయవాడ, అటు వరంగ్ల, ఇటు నిజామాబాద్రూట్లలో రద్దీ పెరిగింది. సొంత కార్లలో బయలుదేరిన వారికి ట్రాఫక్ జామ్ చికాకు తెప్పించింది. టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో టోల్‌గేట్ల వద్ద రద్దీ లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను దారి మళ్లించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పండగ రద్దీ నివారణకు చర్యలు తీసుకున్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు స్వగ్రామాలకు బయలుదేరారు. వరుస సెలవులు ఉండటంతో సొంతూళ్లకు తరలివెళ్లారు. మరోవైపు పండగకు వెళ్లే వారితో మెట్రో రైళ్లలో రద్దీ నెలకొంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారు. మియాపూర్, రాయదుర్గం, జేఎన్టీయూ, అమీర్‌పేట్, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర స్టేషన్ల వద్ద రద్దీ నెలకొంది. సంక్రాంతి సెలవులు వచ్చాయంటే చాలు సొంతూళ్లకు పయనమవుతారు.

# సుంకిశాల వైఫల్యం.. హైదరాబాద్‌కు జలగండం



హైదరాబాద్, హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరాకు ప్రాణాధారమైన కృష్ణాజలాల తరలింపునకు ముప్పు పొంచి ఉన్నదా? నాగార్జునసాగర్‌లో పుష్కలంగా నీటిమట్టం ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు ఎదురవుతాయనే ఆందోళన అధికార యంత్రాంగంలో మొదలైందా? నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ ఇటీవల ప్రభుత్వానికి రాసిన లేఖను పరిశీలిస్తే ఇవి నిజమేననిపిస్తుంది. ఇప్పటికిప్పుడు తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేనప్పటికీ, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) సిస్టర్న్ (చిన్న రిజర్వాయర్) వద్ద ఏర్పడిన లీకేజీలతోపాటు ప్రాజెక్టులోని లింక్ కెనాల్‌పై పలుచోట్ల దెబ్బతిన్నందున వెంటనే అప్రమత్తం కావాల్సిన సమయం ఆసన్నమైందని లేఖలో హెచ్చరించారు. శాశ్వత మరమ్మతులు చేపట్టకపోతే ఊహించని సంఘటనతో పెను ప్రమాదం జరుగుతుందనే సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తాగునీటి సరఫరా కొనసాగేందుకు జలమండలి ప్రత్యామ్నాయం చూసుకోనేలా చర్యలు తీసుకోవాలని లేఖలో ఈఎన్సీ ప్రభుత్వానికి సూచించారు.

ప్రత్యామ్నాయం ఉందా?!

ఇలాంటి అనుకోని ఇబ్బందులు ఎదురవుతాయనే ముందుచూపుతోనే కేసీఆర్ ప్రభుత్వం సుంకిశాల పథకాన్ని చేపట్టింది. 80 శాతానికిపైగా పనులు పూర్తిచేశారు. ఈ పథకం అందుబాటులోకి వస్తే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుతో సంబంధం లేకుండా నాగార్జునసాగర్ జలాశయం నుంచి నేరుగా కృష్ణాజలాలను తోడుకునే అవకాశం ఉండేది. జలమండలితోపాటు నిర్మాణ సంస్థ మేఘా తప్పిదంతో ఈ బృహత్తర పథకం పనులు గత ఏడాది ఆగస్టులో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కార్మికుల కండ్ల ముందే రిటెయినింగ్ వాల్ నిట్టనిలువునా కుప్పకూలింది. ఫలితంగా హైదరాబాద్‌కు కృష్ణాజలాలు తరలించే ప్రత్యామ్నాయ మార్గం మూసుకుపోయింది. నిర్ణీత గడువు ప్రకారం గత డిసెంబర్‌లో ఈ పథకం అందుబాటులోకి వచ్చి ఉంటే నగర నీటి సరఫరాకు ఈ గండం పొంచి ఉండేది కాదు. ముఖ్యంగా ఘటన జరిగినప్పుడు రెండు నెలల్లోనే పనులు పునరుద్ధరిస్తామంటూ నిర్మాణ సంస్థతోపాటు సాక్షాత్తూ ముగ్గురు మంత్రులు ప్రకటించి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు పనులు పునరుద్ధరించేందుకు కించిత్తు అవకాశం కూడా లేదు.

హైదరాబాద్ అవసరాల్లో కృష్ణా జలాల వాటా 48%

హైదరాబాద్‌కు తాగునీటిని అందించేందుకు జలమండలి.. కృష్ణా, గోదావరి, సింగూరు-మంజీరా, జంట జలాశయాల నుంచి రోజుకు సుమారు 565 మిలియన్ గ్యాలన్ల నీటిని తరలిస్తున్నది. ఇందులో కేవలం కృష్ణాజలాలే రోజుకు 270 మిలియన్ గ్యాలన్లు (ఏడాదికి 16.5 టీఎంసీలు). అంటే నగరానికి సరఫరా అవుతున్న మంచినీటి పరిమాణంలో కృష్ణాజలాల వాటా దాదాపు సగం (48%). ఇంతటి కీలకమైన జలాల తరలింపు ప్రక్రియ నల్లగొండ జిల్లాలోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎమ్మార్పీ) ఆధారంగా జరుగుతుంది. పుట్టంగండి వద్ద నాగార్జునసాగర్ జలాశయం ఫోర్‌షోర్ నుంచి ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసుకొని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుతారు. అక్కడినుంచి సమీపంలోని కోదండాపూర్ నీటి శుద్ధి కేంద్రానికి తరలించుకొని వివిధ దశల్లో శుద్ధి చేసి నగరానికి సరఫరా చేస్తున్నారు. అంటే ఏఎమ్మార్ ప్రాజెక్టులోని మోటర్ల నుంచి నీటిని లిఫ్టు చేస్తే తప్ప హైదరాబాద్‌కు కృష్ణాజలాల తరలింపు కుదరదు. అయితే, ఇప్పుడు ఈ ప్రాజెక్టులోని పలు కీలక నిర్మాణాలకు శాశ్వత మరమ్మతులు చేయడం అనివార్యంగా మారిందని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు గుర్తించారు.

సిస్టర్న్‌కు పొంచి ఉన్న ముప్పు?

ఏఎమ్మార్ ప్రాజెక్టులో భాగంగా పుట్టంగండి వద్ద నాగార్జునసాగర్ జలాశయం నుంచి కృష్ణాజలాలను మోటర్ల ద్వారా సిస్టర్న్ (చిన్న జలాశయం)లోకి ఎత్తిపోస్తారు. అక్కడినుంచి 9.26 కిలోమీటర్ల లింక్ కెనాల్ ద్వారా నీటిని హైదరాబాద్-సాగర్ హైవేకు సమీపంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి తరలిస్తారు. ఆ రిజర్వాయర్ నుంచి జలమండలి అధికారులు ఒక పైప్‌లైన్ ద్వారా రోజుకు 330 క్యూసెక్కుల నీటిని కోదండాపూర్ నీటిశుద్ధి కేంద్రానికి తీసుకుంటారు. అయితే, ఏఎమ్మార్ ప్రాజెక్టులోని సిస్టర్న్ వద్ద లీకేజీలు ఏర్పడ్డాయి. ప్రాజెక్టు ప్రారంభం నుంచీ ఇవి ఉన్నప్పటికీ పలుమార్లు మరమ్మత్తులు చేశారు. అయినప్పటికీ భారీ వర్షాల కారణంగా సిస్టర్న్ రిజర్వాయర్ వాల్ పలుచోట్ల కూలిపోగా ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్టు ఈఎన్సీ తన లేఖలో పేర్కొన్నారు. అనంతరం పలుసార్లు ఇంజినీర్లు పరిశీలించగా సిస్టర్న్‌కు శాశ్వత మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉన్నదని నివేదిక ఇచ్చినట్టు తెలిపారు. దీంతోపాటు సిస్టర్న్ నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు ఉన్న 9.26 కిలోమీటర్ల లింక్‌కెనాల్ కూడా పలుచోట్ల దెబ్బతినగా, అక్కడ తాత్కాలిక మరమ్మతులు చేసినా, శాశ్వత మరమ్మతులు చేయాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ప్రాజెక్టులో ఈ రెండు కీలకమైన నిర్మాణాలు అని, వీటిపైనే మూడు లక్షల ఎకరాల ఆయకట్టుతోపాటు హైదరాబాద్ తాగునీరు, మిషన్ భగీరథ కూడా ఆధారపడి ఉన్నదని వివరించారు.

ప్రత్యామ్నాయం చూసుకోండి

సిస్టర్న్, లింక్ కెనాల్‌కు మరమ్మతులు చేయాల్సి ఉన్నందున జలమండలి అధికారులను ప్రత్యామ్నాయం చూసుకునేలా చర్యలు తీసుకోవాలని ఈఎన్సీ తన లేఖలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పుట్టంగండి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు ప్రత్యేక పైప్‌లైన్ వేసుకోవాలని సూచించారు. దీనికోసం భూసేకరణ చేయాల్సిన అవసరంలేదని, లింక్‌కెనాల్ వెంట పైప్‌లైన్ ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. సిస్టర్న్‌కు గండిపడితే దిగువన ఉన్న పంప్‌హౌస్‌కు పెను ప్రమాదం ఉంటుందని ఈఎన్సీ తన లేఖలో ప్రస్తావించారు. మరమ్మతులకు మూడు నెలల సమయం పడుతున్నందున ఆ మేరకు ప్రత్యామ్నాయం చేసుకోవాలని సూచించారు. రాను న్న వేసవిలో శాశ్వత మరమ్మతులు చేస్తేనే వచ్చే వానకాలం సీజన్‌కు ఏఎమ్మార్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి, నల్లగొండ జిల్లాలోని దాదాపు 200 చెరువులను నింపే అవకాశం ఉంటుందని స్పష్టంచేశారు.

సుంకిశాలలో నాలుగు నెలలైనా అదే పరిస్థితి

హైదరాబాద్ తాగునీటికి కేసీఆర్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారంగా చూపిన సుంకిశాల పథకంలో గత ఏడాది ఆగస్టు మొదట్లో రిటెయినింగ్ వాల్ కుప్పకూలి, సొరంగాలన్నీ నీటమునిగాయి. ఈ క్రమంలో నిర్మాణ సంస్థతోపాటు అప్పుడు అక్కడ పర్యటించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు రెండు నెలల్లో పనులు మొదలవుతాయని ప్రకటించారు. కానీ ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా అక్కడ కించిత్తు పునరుద్ధరణ పనులు మొదలుకాలేదు. ముఖ్యంగా పంపుహౌస్‌లో అప్పుడు ఏస్థాయిలో నీటిమట్టం ఉన్నదో.. ఇప్పుడు కూడా అదేస్థాయిలో నీటిమట్టం ఉన్నట్టు తెలిసింది. గతంలో ఆ తప్పిదం జరగకపోయి ఉంటే గత ఏడాది డిసెంబర్‌లోనే సుంకిశాల పథకం అందుబాటులోకి వచ్చేది. ఇప్పుడు ఏఎమ్మార్ ప్రాజెక్టులో మరమ్మతులు జరిగినా సాఫీగా సుంకిశాల నుంచి కృష్ణాజలాల తరలింపు జరిగేది.

## ఆందోళనకరంగా భారత్ ఆర్థిక వ్యవస్థ

న్యూఢిల్లీ,2025లో భారత ఆర్థిక వ్యవస్థ గురించి అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాదిలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉన్నప్పటికీ, భారత్ విషయానికి వస్తే 'కొంచెం బలహీనంగా' ఉంటుందని అంచనా వేశారు. ఈ సంవత్సరం ప్రపంచం చాలా అనిశ్చితిని చూస్తుందని, ప్రధానంగా అమెరికా వాణిజ్య విధానంపై అనిశ్చితి ఉన్నట్లు జార్జివా చెప్పారు. 2025 సంవత్సరంలో ప్రపంచ వృద్ధి స్థిరంగా ఉండే అవకాశం ఉందని, ప్రాంతీయ వైవిధ్యాలు అందులో కనిపిస్తాయని ఆమె వార్షిక మీడియా రౌండ్ టేబుల్ సమావేశంలో అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ 2025 లో కొద్దిగా బలహీనపడవచ్చని జార్జివా ఆందోళన వ్యక్తం చేశారు. అయితే దీని గురించి ఇంకేమీ చెప్పలేదు. దీనిపై మరిన్ని వివరాలు ప్రపంచ ఆర్థిక పరిస్థితిపై రాబోయే నివేదికలో ఇవ్వబడతాయని అన్నారు. అమెరికా మనం ఊహించిన దానికంటే చాలా మెరుగ్గా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో యూరోపియన్ యూనియన్ కొంచెం నిలబడిందని, భారతదేశం కొంచెం బలహీనంగా ఉందని ఆమె అన్నారు. దీంతో పాటు బ్రెజిల్ కొంతవరకు అధిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటోందని ఆమె గుర్తు చేశారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, దేశీయ డిమాండ్‌కు కొనసాగుతున్న సవాళ్ల నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటోందని జార్జివా అన్నారు. వారి అన్ని ప్రయత్నాలు ఉన్నప్పటికీ, తక్కువ ఆదాయ దేశాలు గణనీయమైన ప్రతికూల ప్రభావాన్ని చూపే పరిస్థితిలో ఉన్నాయని జార్జివా అన్నారు. ఈ క్రమంలో 2025లో ఆర్థిక విధానాలకు సంబంధించి చాలా అనిశ్చితి ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ పరిమాణం, పాత్రను దృష్టిలో ఉంచుకుని, రాబోయే పరిపాలన విధాన చర్యలు, ముఖ్యంగా సుంకాలు, పన్నులు, నియంత్రణ వంటివి ఉంటాయన్నారు. చైనా, కెనడా, మెక్సికో వంటి దేశాలపై అదనపు సుంకాలను విధించే ప్రణాళికలను డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. జనవరి 20న ఆయన అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సుంకాలను కీలక విధాన సాధనంగా ఉపయోగించాలనే తన ఉద్దేశాన్ని ఆయన బహిరంగంగా ప్రకటించారు. ఈ అనిశ్చితి వాణిజ్య విధానం ముందుకు సాగడానికి సంబంధించినదని జార్జివా చెప్పారు. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను మరింత పెంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సరఫరా వ్యవస్థపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థలు అనిశ్చితికి గురవుతాయని ఎఓఈ మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు.

## మరింత పడిపోయిన రూపాయి విలువ

న్యూఢిలీ,అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ భారీగా పడిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలన్నారు. శుక్రవారం రూపాయి విలువ ఒక్కసారిగా 16 పైసలు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా 86.04కి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ఎక్స్' వేదికగా ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. 'చరిత్రలోనే తొలిసారిగా రూపాయి మారకం విలువ కనిష్ఠ స్థాయికి చేరుకుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో డాలరుతో రూపాయి మారకం విలువ 58-59 గా ఉండేది. అప్పట్లో నరేంద్ర మోదీ రూపాయి విలువను ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపెట్టేవారు. డబ్బు విలువ ఏ దేశంలోనూ ఇంతగా పడిపోదని, అంతా తనకే తెలుసని చెప్పేవారు. మరి ఇప్పుడేమైంది. ఆయనే ప్రధానిగా ఉన్నారు. పతనంలో రూపాయి రికార్డులు సృష్టిస్తోంది. రోజు రోజుకూ దాని విలువ పడిపోతోంది. అందువల్ల దేశ ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

## గ్రీన్‌కో ప్రాజెక్టుతో తీరనున్న విద్యుత్ సమస్య

కర్నూలు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రీన్ కో ప్రాజెక్టు కోసం రూ.30 వేల కోట్లు పెట్టుబడులు పెట్టారని, ఇంకా పెడుతూనే ఉన్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. భారతదేశంలో ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టారని పవన్ వెల్లడించారు. కర్నూలులో ఏర్పాటు చేసిన గ్రోన్ కో ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ప్రత్యక్షంగా, 40 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ రంగం తర్వాత గ్రీన్ ఎనర్జీ మీద ఫోకస్ చేస్తున్నారని, అందుకే వ్యవసాయానికి పనికిరాని భూముల్లో ఇలాంటి అద్భుతమైన ప్రాజెక్టు చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి చెప్పారు. శనివారం కర్నూలు జిల్లాలోని గ్రీన్ కో ప్రాజెక్టును పవన్ కల్యాణ్ సందర్శించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లాలో పర్యటించారు. పిన్నాపురం వద్ద ఏర్పాటైన అతిపెద్ద గ్రీన్‌కో సోలార్ పార్క్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్‌ను ఏరియల్ వ్యూ ద్వారా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టుకు సంబంధించి 45 హెక్టార్ల భూమి రెవెన్యూ, అటవీశాఖల మధ్య వివాదంలో ఉందని, దాన్ని పరిష్కరించేందుకే తాను వచ్చినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. ఆఫీసులో కూర్చుని చూడటం వేరని, ఫీల్డ్‌కి వచ్చి నేరుగా చూడటం వేరని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే తానే స్వయంగా గ్రీనో కో ప్రాజెక్టు చూసేందుకు వచ్చినట్లు పవన్ చెప్పుకొచ్చారు. గాలి, నీరు, సౌర కాంతితో విద్యుత్ తయారు చేయడంలో ప్రపంచంలోనే ఇది మొదటి అతిపెద్ద ప్రాజెక్టని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇదో గొప్ప పర్యాటక ప్రాంతం అవుతుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ కో ప్రాజెక్టు కోసం ఇప్పటివరకూ రూ.12 వేల కోట్లు ఖర్చు చేశామని, ఇంకా రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఏపీలో మూడో వంతు విద్యుత్ అవసరాలను ఈ ప్రాజెక్టు తీర్చగలదని ఆయన చెప్పారు. ప్రాజెక్టు విషయంలో ఏ వివాదం ఉన్నా.. కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ప్రభుత్వ భూములు అధికంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. అన్ని జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు ఆయన చెప్పారు. అటవీ భూములు ఎంతమేర అన్యాక్రాంతం అయ్యాయనే దానిపై త్వరలో డ్రైవ్ పెడతామని ఉపముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఎన్ని ఎకరాల భూములు ఆక్రమణలకు గురయ్యాయి, అలాగే ఇంకా ఎంతమేర మిగిలి ఉన్నాయనే విషయాలను డ్రైవ్ ద్వారా పరిశీలిస్తామని చెప్పారు. ఆ తర్వాత తానే నేరుగా ఫీల్డ్‌లోకి దిగనున్నట్లు పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. కేంద్రం అనుమతితో 365 హెక్టార్ల అటవీ భూమిని సంస్థ కొనుగోలు చేసింది. అందుకు నెల్లూరులో రూ. 36 కోట్ల విలువైన భూమిని సంస్థ ప్రభుత్వానికి ఇచ్చింది. ఫారెస్టు, రెవెన్యూ మధ్య 45 హెక్టార్ల భూమి వివాదంలో ఉంది.

# పవన్ ఒక సారీ అన్నారంటే ?



అమరావతి,పవన్ కళ్యాణ్ రీల్ లైఫ్ లో పవర్ స్టార్. అయితే 2024 ఎన్నికల ఫలితాలను దానికి ముందు ఆయన పన్నిన వ్యూహాలనూ చూసిన వారు అంతా పవన్ ని పొలిటికల్ పవర్ స్టార్ అని కూడా అంటారు. 2019లో పోటీ చేసిన రెండు సీట్లలో ఓటమి పాలు అయిన పవన్ 2024లో ఏకంగా చంద్రబాబు తరువాత ప్లేస్ అయిన ఉప ముఖ్యమంత్రి పదవిని అందుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఆయన ఇపుడు అత్యంత కీలకంగా బలంగా కూడా ఉన్నారు.ఎంతలా అంటే పవన్ మాటే శాసనం అన్నట్లుగా అని అంటున్నారు. ఆయన ఒకసారి చెబితే చాలు అన్నట్లుగా ఉంది. పవన్ ప్రభుత్వం తరఫున తిరుపతి తొక్కిసలాట ఘటనకు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఆ మీదట టీటీడీ వంతు అన్నారు. అయితే దీని మీద టీటీడీ మొదట అంతగా రియాక్ట్ కాలేదు.పిఠాపురం సభలో పవన్ ఇదే ఇష్యూని రెట్టించారు. దాంతో తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున చైర్మన్ హోదాలో ఉన్న బీఆర్ నాయుడు తొక్కిసలాట ఘటనకు క్షమాపణలు చెప్పారు. ఆయన మొదట మీడియా సమావేశంలో మాట్లాడినపుడు క్షమాపణలు చెబితే పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా అన్నట్లుగా మాట్లాడారు.కానీ ఆయన ఆ తరువాత మళ్లీ ఆయనే మీడియా ముందుకు వచ్చి క్షమాపణలు చెప్పారు. దీంతో పవన్ కళ్యాణ్ చేసిన డిమాండ్ అలా నెరవేరింది అని అంటున్నారు. నిజానికి క్షమాపణలు చెబితే ఏమి అవుతుంది అన్నది కాదు తప్పు జరిగినపుడు బాధ్యత తీసుకుని మరోసారి ఇలా జరగదు అని పెద్ద మనసులో చెప్పడానికే అని అంటున్నారు. ఒక విధంగా బాధితులకు ఎంతో కొంత ఊరటను ఇస్తుందని భావించి పవర్ ఈ ప్రతిపాదన చేశారు.అయితే పవన్ చేసిన ఈ ప్రతిపాదన ఏపీలోనే కాదు దేశంలోనే మొదటిది అని చెప్పాలని అంటున్నారు. చాలా చోట్ల ప్రభుత్వంలో తప్పులు జరిగినా ప్రజా ప్రతినిధులు కానీ కీలక స్థానాలలో ఉన్న వారు కానీ క్షమాపణలు చెప్పరు. అయితే పవన్ మాత్రం ఇతర దేశాలలో కొన్ని చోట్ల ఈ విధానం అమలులో ఉందని పిఠాపురం సభలో చెప్పారు.దానిని ఏపీలో ఆయన అమలు చేయాలని కోరుకున్నారు. తనతోనే ప్రారంభించారు. మొత్తానికి పవన్ చెప్పిన విధంగా ఏపీలో క్షమాపణ పర్వం సాగింది. ఈ ఇష్యూతో పవన్ చెప్పాడంటే చేయాలంతే అన్నది బలపడుతోంది. పవన్ కళ్యాణ్ కూటమికి రాజకీయంగా కీలకం కావడంతో ఆయన మాట నెగ్గుతోంది అని అంటున్నారు.ఏపీలో 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం 2029 ఎన్నికల్లోనూ పొత్తులతోనే ముందుకు సాగాలని చూస్తోంది. దానంతో పవన్ కళ్యాణ్ కి రాజకీయంగానే కాదు ప్రభుత్వ పరంగా ఎనలేని ప్రాధాన్యత దక్కుతోందని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే పవన్ కూడా కూటమి తరఫున ఏమైనా పొరపాట్లు జరిగితే వాటిని చెప్పడం ద్వారా ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు అలెర్ట్ చేస్తున్నారు. మొత్తానికి పవన్ హవా అయితే కూటమి ప్రభుత్వంలో గట్టిగానే సాగుతోందని అంటున్నారు.

# బల్దియాలో ట్రేడ్ లైసెన్స్‌ల దందా..

హైదరాబాద్,అప్పుల ఊబిలో చిక్కుకున్న జీహెచ్ఎంసీ ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు ఒక వైపు ప్రయత్నాలు చేస్తుంటే, మరోవైపు సర్కిల్ స్థాయి సిబ్బందిలో అదే అదునుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కంచే చేను మేసిన చందంగా సర్కిళ్లలో అధికారులు ట్రేడ్ లైసెన్స్‌ల వెరిఫికేషన్‌లో పలు అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జీహెచ్ఎంసీ ప్రధాన ఆర్థిక వనరుల్లో ఒకటైన ట్రేడ్ లైసెన్సులను వెరిఫికేషన్ చేస్తే కొంత మేరకు ఆదాయం సమకూరుతుందని భావించి కమిషనర్ వెరిఫికేషన్ ఆదేశాలు జారీ చేశారు. అయితే కొందరు అవినీతి అధికారులకు వరంగా మారినట్లు కూడా విమర్శలున్నాయి.జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిల్స్‌లో ఉన్న సుమారు రెండు లక్షల 49 వేల 522 ట్రేడ్ లైసెన్సులను మరోసారి సర్కిళ్ల వారీగా వెరిఫికేషన్ చేయాలని కమిషనర్ జారీ చేసిన ఆదేశాల మేరకు దాదాపు అన్ని సర్కిళ్లలో గడిచిన పదిహేను రోజులుగా వెరిఫికేషన్ కొనసాగుతుంది. అన్ని సర్కిళ్లలోనున్న ట్రేడ్ లైసెన్స్‌లలో అత్యధికంగా 34 వేల 137 ట్రేడ్ లైసెన్స్‌లు గోషామహల్ సర్కిల్‌లో ఉండగా, అత్యల్పంగా చాంద్రాయణగుట్టలో 2451 ఉన్నట్లు సమాచారం. ఈ ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి కొనసాగుతున్న వ్యాపారాలు తీసుకున్న లైసెన్స్ ప్రకారమే కొనసాగుతున్నాయా? అదనంగా వ్యాపార లావాదేవీలు ఏమైనా జరుగుతున్నాయా? అన్న కోణాల్లో ఈ వెరిఫికేషన్ కొనసాగుతున్నట్లు సమాచారం. ఏండ్ల కింద తీసుకున్న ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి కొనసాగుతున్న వ్యాపారాలు నేడు ఒకటి నుంచి రెండు, మూడు మలిగీలకు, అంతస్తులకు విస్తరించిన వాటిని తాజాగా అప్ డేట్ చేస్తే కొంత మేరకైనా బల్దియాకు లాభం చేకూరుతుందని అధికారులు భావించగా, స్వామి కార్యం స్వకార్యం అన్న చందంగా కొందరు అధికారులు సర్కిళ్లలో ట్రేడ్ లైసెన్స్‌ల దందాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వ్యాపారస్తుల నుంచి బేరసారాలు కుదుర్చుకుని పాత లైసెన్సుల ఫీజులనే కొనసాగిస్తూ జీహెచ్ఎంసీ ఖజానాకు రావాల్సిన నిధులను దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.




ప్రశ్నిస్తే..

ఏళ్ల క్రితం జారీ చేసిన ట్రేడ్ లైసెన్స్‌లను ప్రస్తుత క్షేత్ర స్థాయి పరిస్థితులకు అనుగుణంగా అప్‌డేట్ చేసేందుకు కొందరు కార్పొరేషన్ ఉద్యోగులు నిజాయితీగా విధులు నిర్వహిస్తుండటంతో.. కొందరు డిప్యూటీ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు అడ్డుపడుతున్నట్లు సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. వ్యాపారస్తుల నుంచి బేరసారాలు కుదుర్చుకుని పాత ట్రేడ్ లైసెన్స్ కొనసాగించేలా డిప్యూటీ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు వారికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఈ క్రమంలో అధికారుల అవకతవకలను ప్రశ్నిస్తున్న శానిటరీ జవాన్, లైజనింగ్ ఆఫీసర్లకు కారణం లేకుండానే నోటీసులు జారీ చేసి వేధింపులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి పరిణామాలు ఇటీవలే ఖైరతాబాద్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్లలో చోటుచేసుకున్నట్లు వినికిడి. ఈ వ్యవహారంపై నోటీసులు స్వీకరించిన కొందరు ఉద్యోగులతో పాటు మరి కొందరు యూనియన్ నేతలు సంక్రాంతి పండుగ తర్వాత కమిషనర్ వద్ద పంచాయతీ పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

# కేంద్రంపై డీఎంకే మంత్రి సంచలన వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ,కేంద్ర ప్రభుత్వంపై తమిళనాడుకు చెందిన డీఎంకే మంత్రి తంగం తెనరసు సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష సూపిస్తోందంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయాల్లో దుమారాన్ని రేపుతున్నాయి.గడిచిన కొన్నాళ్లుగా కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిపై ఈ తరహా విమర్శలు పెరుగుతున్నాయి. గతంలో తెలంగాణకు చెందిన నేతలు కూడా ఇదే తరహాలో విమర్శలు చేశారు. ప్రస్తుతం తమిళనాడుకు చెందిన డీఎంకే నేతలు ఇటువంటి విమర్శలను తరచుగా చేస్తూ వస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలకు ప్రాధాన్యతనిస్తూ దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తోందన్న భావన దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల నాయకుల్లో వ్యక్తం అవుతోంది. ఈ అభిప్రాయాన్ని తాజాగా డీఎంకేకు చెందిన మంత్రి తంగం తేనరసు బహిరంగంగా వ్యక్తం చేశారు.ముఖ్యంగా పన్నుల వాటాలో కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తూందని ఆయన వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 31.5 కోట్ల జనాభా ఉందన్నారు. ఈ రాష్ట్రాలకు రూ.27,336 కోట్ల రూపాయలను మాత్రమే పన్నులకు సంబంధించిన వాటాను కేంద్రం కేటాయించిందని పేర్కొన్నారు. అదే యూపీ, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 44.3 కోట్ల జనాభా ఉందని, ఆయా రాష్ట్రాలకు మాత్రం భారీగా నిధులను కేంద్రం కేటాయిస్తుందన్నారు. తాజాగా ఉత్తరాదికి చెందిన ఈ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.62,024 కోట్ల రూపాయల నిధులను కేంద్రం మంజూరు చేసిందని పేర్కొన్నారు.దక్షిణాదికి 15% నిధులను మాత్రమే కేటాయించగా.. ఉత్తరాదికి చెందిన ఈ మూడు రాష్ట్రాలకే 40 శాతం నిధులు ఇవ్వడం వివక్ష కాదా.? అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను తమ బిడ్డలు మాదిరిగా చూసుకోవాల్సి ఉందని, కానీ అటువంటి విధంగా మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చూడడం లేదని వ్యాఖ్యానించారు. ఉత్తరాది రాష్ట్రాలపై అమితమైన ప్రేమను చూపిస్తూ, దక్షిణాది రాష్ట్రాలపై సవతి ప్రేమ చూపిస్తుందంటూ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలను చిన్న చూపు చూడడం



మానేయాలని ఆయన హితవు పలికారు. ప్రస్తుతం డీఎంకేకు చెందిన మంత్రి చేసిన వ్యాఖ్యలు తెగ వైరల్ అవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వేలాదిమంది మంత్రి వ్యాఖ్యల వీడియోలను సర్కులేట్ చేస్తూ దక్షిణాది రాష్ట్రాలకు మద్దతును ప్రకటిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా వ్యవహరించాలని, అందుకు అనుగుణంగా నిధులను కేటాయించాలన్న డిమాండ్ వ్యక్తం అవుతుంది.దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవహార శైలి పట్ల ఇప్పుడే కాదు గతంలో కూడా విమర్శలు వ్యక్తం అయ్యాయి. గతంలోనూ వివిధ పార్టీలకు చెందిన నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద ఎత్తున ప్రాధాన్యతను ఇస్తూ దక్షిణాది రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తున్న విమర్శలను కేంద్రం మూటగట్టుకుంటుంది. ఈ తరహా ఆరోపణలు ఎప్పటినుంచో వస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ పెద్దలు మాత్రం పట్టించుకోవడం లేదు. తాజాగా తమిళనాడుకు చెందిన మంత్రి స్వయంగా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రస్తుతం ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ వ్యాఖ్యలపై కేంద్రంలోని మంత్రులు ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది. బిజెపి నేతృత్వంలోనే కేంద్ర ప్రభుత్వం మాత్రం తాము అన్ని రాష్ట్రాలకు నిధులను సమానంగానే అందిస్తున్నామని, అన్ని రాష్ట్రాల అభివృద్ధి తమ లక్ష్యమని అందరం పేర్కొంటూ ఉంది.

# జగన్ బలం అక్కడేనా...అందుకే గట్టిగా టార్గెట్ !



వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ బలం ఎక్కడ సాలిడ్ గా ఉంది అంటే రాజకీయం తెలిసిన వారు చెప్పేయవచ్చు. ఆయనకు రాయలసీమ నాలుగు జిల్లాలలో బలం ఉంది. అక్కడ ఉన్న ఉమ్మడి చిత్తూరు, కర్నూల్, అనంతపురం కడపలలో మొత్తం 52 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అంటే ఏపీలో ఏ పార్టీ అయినా అధికారంలోకి రావడానికి అవసరం అయిన మ్యాజిక్ ఫిగర్ 88 సీట్లు అయితే అందులో సగానికంటే ఎక్కువగానే ఒక రీజియన్ లో ఉన్నాయి.ఇక్కడ వైసీపీకి బలం ఉంది. 2024 ఎన్నికల్లో అయితే వైసీపీ ఓటమి పాలు కావచ్చు కానీ ఆ పార్టీ మళ్లీ పుంజుకుంటే రాయలసీమలో స్వీప్ చేయడం కష్టం కాదని కూడా అంటున్నారు. ఇక అక్కడ పట్టు సాధించి నెల్లూరు ఒంగోలులో గణనీయమైన సీట్లు తెచ్చుకుంటే మిగిలిన కోస్తా జిల్లాలలో ఏ మాత్రం అనుకూలత పెరిగిన మరోసారి జగన్ సీఎం అన్నది వైసీపీ మాట నెరవేరుతుందని అంటున్నారు.అందుకే వైసీపీకి ఎక్కడ కొట్టాలీ అంటే రాయలసీమలోనే అని అంటున్నారు. ఈ విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు అయితే చాణక్య వ్యూహాలనే అమలు చేస్తున్నారు అని అంటున్నారు. 2024 ఎన్నికల్లో జగన్ పార్టీ ఓడినా నలభై శాతానికి తక్కువ కాకుండా ఓటు షేర్ ఒంటరిగా దక్కించుకున్న విషయాని బాబు లాంటి అనుభవజ్ఞుడు ఎలా మరచిపోగలుగుతారు. అందుకే ఆయన ఇప్పటి నుంచే 2029 ఎన్నికల కోసం పక్కాగా ప్లాన్ చేస్తున్నారుఇక జనసేన బీజేపీలతో కలసి 2029 ఎన్నికలను ఎదుర్కోవాలని బాబు ఇప్పటికే అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఆరు నూరు అయినా ఈ పొత్తు కొనసాగే అవకాశాలే ఉన్నాయి. ఏదో అద్భుతం జరిగితేనే తప్ప ఈ పొత్తు వీడేది కాదు. మరో వైపు చూస్తే రాయలసీమలో గతం లో కంటే ఈసారి అత్యధిక సీట్లను కూటమి గెలుచుకుంది. అంతే కాదు వైసీపీని దాదాపుగా జీరో చేసి పారేసింది.దానికి కారణం సీమలో జనసేన ప్రభావం ఉందని నమ్ముతున్నారు. యువత ఎక్కువగా పవన్ పట్ల అట్రాక్ట్ అవుతారు. అలాగే బలమైన సామాజిక వర్గం కూడా ఆ పార్టీకి దన్నుగా ఉంది. దాంతో వచ్చే ఎన్నికల్లోనూ ఇదే రకమైన థియరీ ని అమలు చేయాలని బాబు యోచిస్తున్నారు అని అంటున్నారు.అందుకే తరచూ రాయలసీమ పర్యటనలు పవన్ చేస్తున్నరు అని ఆయనను ఆ దిశగా బాబు ప్రయోగిస్తున్నారు అని అంటున్నారు. ఆ మధ్యన పవన్ కడప వెళ్ళి మరీ ఒక ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు. తాను అండగా ఉంటాను అన్నారు. వైసీపీ నేతలను హెచ్చరించారు. దాని కంటే ముందు టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ కి కడపనే పవన్ ఎంచూన్నారు.ఇపుడు చూస్తే లేటెస్ట్ గా పవన్ కర్నూల్ జిల్లా వెళ్లారు. గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను ఆయన పరిశీలించరు. ఒక డే లాంగ్ ప్రోగ్రాం గా ఇది సాగింది. ఇలా తరచూ పవన్ వెళ్ళడమే కాదు అవసరమైతే కడపలో క్యాంప్ ఆఫీసుని ఏర్పాటు చేస్తాను అని కూడా అంటున్నారు.ఇదంతా ఎందుకు అంటే వైసీపీని రాజకీయంగా నిలువరించడానికే అంటున్నారు. రాయలసీమలో టీడీపీ బలానికి తోడు జనసేన కూడా తోడు అయితే ఇక మరోసారి సీమలో ఎదురు ఉండదన్న భారీ వ్యూహంతోనే ఇవన్నీ అమలు చేస్తున్నారు అని అంటున్నారు. అంతే కాదు వైసీపీని దెబ్బ తీయాలంటే అక్కడ పవన్ అస్త్రం వాడాల్సిందే అని డిసైడ్ అయింది అంటున్నారు.ఇక గోదావరి జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర క్రిష్ణా గుంటూరులలో ఎటూ కూటమికి రాజకీయ ఆధిపత్యం ఉందని భావిస్తోంది. అందువల్ల వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలోనే బలోపేతం కాకుండా అడ్డుకుంటే ఆ ప్రభావం మిగిలిన ప్రాంతాల మీద పడకుండా ఉంటుందని ముందస్తు వ్యూహాలను అమలు చేస్తోంది అంటున్నారు.

## సంక్రాంతి ప్రయాణికులకు విమాన షాక్

విశాఖపట్నం, సంక్రాంతి పండగకు ప్రజలంతా పెద్ద ఎత్తున సొంతూళ్లకు వెళ్తుండటంతో బస్సులు, రైళ్లు కిక్కిరిసిపోతున్నాయి. మూడు, నాలుగు నెలల క్రితమే రైళ్లకు రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ లిస్టులు చాంతాడంత ఉన్నాయి. ప్రత్యేక బస్సులు, రైళ్లు వేసినా నిమిషాల వ్యవధిలోనే నిండిపోతున్నాయి. ఈ క్రమంలోనే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు.

# ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేలా ఎందుకు మాట్లాడుతున్నట్లు?



హైదరాబాద్,మాస్ లీడర్.. దానం నాగేందర్ రూటే సెపరేటు. ఆయన ఏ పార్టీలో ఉన్న..ఏ పదవిలో ఉన్న..ఎప్పుడు ఏదో ఒక ఇష్యూతో టాక్ ఆఫ్ ది మీడియాగా మారుతుంటారు. పక్కా హైదరాబాదీ స్లాంగ్‌తో డైలాగులు పేల్చుతూ, ధమ్కీలు ఇస్తూ తన హవా నడిపిస్తుంటారు. అయితే మొన్నటి ఎన్నికల తర్వాత కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైందట. మంత్రి పదవి వస్తుందన్న ఆశతో హస్తం పార్టీలో చేరిన ఆయనకు అమాత్య యోగం దక్కలేదు.పైగా ఆయనకు ఇష్టం లేకపోయినా లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీగా కంటెస్ట్ చేయించారట కాంగ్రెస్ పెద్దలు. ఆ తర్వాత అయినా మంత్రి పదవి వస్తుందని ఆశిస్తే భంగపాటు తప్పదని భావిస్తున్నారట. పైగా తను ఏదైనా పని చేయాలని అడిగితే ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని గుస్సా అవుతున్నారట దానం. అందుకే కొన్నాళ్లుగా కాంగ్రెస్ సర్కార్ పెద్దలు, సీఎం రేవంత్ తీరుపై అసంతృప్తితో ఉన్నారట. ఈ నేపథ్యంలో దానం టంగ్ చేంజ్ చేశారన్న టాక్ వినిపిస్తోంది.వైఎస్ హయాంలో గ్రేటర్ హైదరాబాద్‌లో రాజకీయంగా ఓ ఊపు ఊపిన దానం.. 2014 తర్వాత పెద్దగా చెప్పుకోదగ్గ పదవిలో ఉండలేకపోయారు. 2014లో ఓడిన దానం.. తిరిగి 2018లో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ గూటికి చేరారు. కేసీఆర్ క్యాబినెట్‌లో బెర్త్ ఆశించినా దక్కలేదు. తర్వాత హస్తం గూటికి చేరినా ఆయనను పట్టించుకునే నాధుడే లేడట. అందుకే దానం రూటు మార్చినట్లు చర్చ జరుగుతోంది. ఓ వైపు ప్రభుత్వాన్ని, మరోవైపు కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేలా మాట్లాడుతుండటంతో..ఈ వలస ఎమ్మెల్యే వ్యవహారం ఇబ్బందికరంగా మారిందని గాంధీభవన్ టాక్.

అందుకే సైలెంట్?

పవర్ ఎక్కడుంటే దానం నాగేందర్ అక్కడుంటాడన్నది పబ్లిక్ మాట. అందుకు అనుగుణంగానే అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఆయన హస్తం పార్టీలోకి వెళ్లారు. కాంగ్రెస్ బీఫామ్ మీద ఎంపీగా పోటీ చేయడంతో ఆయనపై అనర్హత వేటు పడటం ఖాయమన్న చర్చ జరుగుతోంది. అయితే ఖైరతాబాద్ బైపోల్ వస్తే దానంకు టికెట్ ఇవ్వకూడదని హస్తం పార్టీ డిసైడ్ అయ్యిందన్న చర్చ కూడా జరిగింది. ఈ విషయాలన్నీ కాస్త ఆలస్యంగా గ్రహించిన దానం కొంత సైలెంట్ అయిపోయారట.

ఇక ఊరికే ఉండలేకే సీఎం రేవంత్‌తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా మాట్లాడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతున్న ఫార్ములా ఈ కార్ రేస్ విషయంలో దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేలా ఉన్నాయంటున్నారు.ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారని దానం నాగేందర్ అంటుండంతో ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదట. ఈ కార్ రేస్ వ్యవహారంలో అవినీతి జరిగిందని, దాన్ని నిరూపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న సమయంలో అధికార పార్టీలో ఉండి దానం నాగేందర్ ప్రతిపక్ష నేతకు అనుకూలంగా మాట్లాడటం ఏంటన్న చర్చ జరుగుతోంది.ఈ ఒక్క ఇష్యూనే కాదు పలు సందర్భాల్లో దానం చేసిన కామెంట్స్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారాయన్న చర్చ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలను విమర్శించేలా, సర్కార్‌ను కార్నర్ చేసేలా దానం కామెంట్స్ చేస్తున్నారని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారట. చెరువుల పరిరక్షణ కోసం తీసుకొచ్చిన హైడ్రాకు వ్యతిరేకంగా విమర్శలు చేసి ఇటు ప్రభుత్వాన్ని, అటు పార్టీని ఇరుకునపడేలా చేశారు దానం నాగేందర్.

రేవంత్ అండ్ టీంకు ఏం చేయాలో అర్థం కావడం లేదా?

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయిన దానం.. పరోక్షంగా ప్రతిపక్షాలకు ఛాన్స్ ఇచ్చారని అప్పట్లో చర్చ జరిగింది. ఇక అల్లుఅర్జున్ అరెస్ట్ ఇష్యూలో కూడా దానం నాగేందర్ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టడం చర్చనీయాంశమవుతోంది. అల్లుఅర్జున్ అరెస్ట్ సరికాదని, పార్టీకి నష్టమంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కామెంట్స్ చేయడంతో..రేవంత్ అండ్ టీంకు ఏం చేయాలో అర్థం కావడం లేదట.అయితే దానం నాగేందర్ ఇలా ప్రభుత్వానికి, పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటం వెనుక అసలు కారణం వేరే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తన వ్యక్తిగత సమస్యలు కొన్నింటిని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరగా..సీఎం రేవంత్ రెడ్డి సహా మంత్రులెవరు పెద్దగా పట్టించుకోవడం లేదట. అందుకే దానం ప్రభుత్వాన్ని, పార్టీని ఇరుకున పెట్టేలా మాట్లాడుతున్నారని అంటున్నారు. రివర్స్ గేర్ వేస్తేనే తనను పిలిచి బుజ్జగించి, అడిగిన పనులన్నీ చేసిపెడతారని దానం భావిస్తున్నారట.ఈ నేపథ్యంలోనే లేటెస్ట్‌గా దానం కేసీఆర్‌ను పొగడటం..ఫార్ములా ఈ రేస్ విషయంలో కేటీఆర్‌కు అనుకూలంగా మాట్లాడటం వంటివి చర్చకు వస్తున్నాయి. అయితే దానం తిరిగి కారు ఎక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. బీఆర్ఎస్ మాత్రం దానం లాంటి లీడర్లను తీసుకోవద్దని.. అలాంటి నేతలను ఎంకరేజ్ చేయొద్దని డిసైడ్ అయిందట. సో అటు హస్తం పార్టీలో తన పనులు చక్కబెట్టుకోలేక..తిరిగి గులాబీ కండువా కప్పుకునే పరిస్థితి లేక..డైలమాలో ఉన్నారట దానం. అందుకే పొలిటికల్ రివర్స్ గేర్ వేశారని అంటున్నారు. దానం కామెంట్స్ మీద కాంగ్రెస్ నేతలు ఎలా స్పందిస్తారనేది చూడాలి మరి.

# జనవరి 15న కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించనున్న సోనియా


న్యూఢిల్లీ, దేశంలోని పురాతన పార్టీ కాంగ్రెస్ కొత్త జాతీయ ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం చిరునామా 24, అక్బర్ రోడ్డు.కానీ ఇప్పుడు పార్టీ కొత్త స్థానం న్యూఢిల్లీలోని కోట్ల రోడ్‌లోని 9%ూ% వద్ద ఉంటుంది. దీని కార్యాలయానికి ఇందిరా గాంధీ భవన్ అని పేరు పెట్టారు. న్యూఢిల్లీలోని కోట్ల రోడ్‌లోని 9A వద్ద ఉన్న తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా గాంధీ భవన్‌ను జనవరి 15న ఉదయం 10 గంటలకు ఘనంగా ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ ఆదివారం ప్రకటించింది. ఈ కొత్త ప్రధాన కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రారంభిస్తారు. ఈ సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా హాజరవుతారు.

కొత్త ప్రధాన కార్యాలయానికి ఇందిరా భవన్

కొత్త ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పేరు పెట్టారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్ వంటి ప్రముఖుల నాయకత్వంలో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా, కాంగ్రెస్ ఆధునిక, ప్రజాస్వామ్య, సమానమైన భారతదేశాన్ని నిర్మించడానికి అంకితభావంతో పని చేస్తుంది.

400 మంది నాయకులకు ఆహ్వానం

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, శాశ్వత, ప్రత్యేక



ఆహ్వానితులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకులు, రెండు పార్టీల పార్లమెంటు సభ్యులు సహా దాదాపు 400 మంది అగ్ర నాయకులను ఆహ్వానించారు. లోక్‌సభ, రాజ్యసభ, ఏఐసీసీ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, విభాగాల అధిపతులు, సెల్‌లు, మాజీ ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్‌పీ నాయకులు, కేంద్ర మంత్రులు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కూడా ప్రముఖ ఆహ్వానితులలో ఉన్నారు.

ఆధునిక సౌకర్యాలతో కార్యాలయం

ఇందిరా గాంధీ భవన్ పార్టీ, దాని నాయకుల పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి, పరిపాలనా, సంస్థాగత, వ్యూహాత్మక కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి ఆధునిక సౌకర్యాలతో రూపొందించబడింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com